# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 23-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:161 పేజీలు:6 వెల: రూ.1/-


**చురక**

ఎక్కడుంది కమలానికి
ఎన్నికల రాజనీతి
అక్రమమో సక్రమమో
అధికారమే దాని రీతి.

మెజారిటీతో పనిలేదు
మేయర్ గా తమ వ్యక్తి
చండీగర్ లో డెమోక్రసీ
చంపివేసే దుష్ట యుక్తి



-వేల్పుల నారాయణ
9440433475

## రైతు సంక్షేమానికి సంబంధించిన ప్రతి డిమాండ్‌ను నెరవేర్చేందుకు సిద్ధం

**- స్పష్టం చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**

న్యూ డిల్లీ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):రైతు సంక్షేమానికి సంబంధించిన ప్రతి డిమాండ్‌ను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కేంద్రం చెరకు పంటకు గిట్టుబాటు ధరను పెంచిన నేపథ్యంలో గురువారం ఆయన ఈ విధంగా స్పందించారు.దేశ వ్యాప్తంగా ఉన్న అన్నదాతలకు సంబంధించిన ప్రతి తీర్మానాన్ని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే చారిత్రాత్మక నిర్ణయం వెలువడిందని చెప్పారు. చెరకు కొనుగోలు ధర పెంపుకు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ చర్య వల్ల చెరకు ఉత్పత్తి చేసే కోట్లాది మంది రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటూ మోదీ ట్వీట్ చేశారు. కాగా, తమ పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చేలా చట్టబద్ధత చేయడంతో పాటు.. రుణమాఫీ, పలు డిమాండ్లతో రైతులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో మోదీ ట్వీట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## కన్నెపల్లి నుంచి మేడారం గద్దెకు చేరుకున్న సారలమ్మ



మేడారం ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మేడారం జాతరలో తొలి అంకం పూర్తయ్యింది. కన్నెపల్లి నుంచి సారలమ్మ మేడారం గద్దెకు చేరుకుంది. డప్పు డోలు వాయిద్యాలతో కోలాహలంగా బయల్దేరిన సారలమ్మ.. భక్తుల జయజయధ్వానాల మధ్య జంపన్న వాగు మీదుగా బుధవారం మేడారానికి చేరుకున్నది. పూనగొండ్ల నుంచి పడిగిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజు తరలివచ్చి మేడారం గుడి వద్ద సారలమ్మకు స్వాగతం పలికారు.

రెండేండ్ల తర్వాత వన దేవతల రాకతో ఒక్కసారిగా మేడారంలోని భక్తజనం పరవశంతో పులకించిపోయారు.కాగా, గురువారం నాడు సమ్మక్క కూడా మేడారం గద్దెలపైకి చేరుకోనుంది. చిలుకలగుట్ట నుంచి తల్లి దిగి వచ్చి భక్తుల మొక్కులు అందుకోనుంది. సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య గద్దెలపై ప్రతిష్ఠించనున్నారు.

## మార్కెట్ యార్డులలో శుక్రవారం నుంచి పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**-కనీస మద్దతు ధర రూ. 6760 కంటే తక్కువ ధరకు విక్రయించ వద్దు**

**-మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల విజ్ఞప్తి**

హైదరాబాద్ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);పొద్దుతిరుగుడు కోతలు ఆరంభమైన దృష్ట్యా , మార్కెట్లో కనీస మద్దతు ధర రావడం లేదన్న విషయం గౌరవ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు దృష్టికి వెళ్లడంతో వెంటనే మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలను రేపటి నుంచి ప్రారంభించి పొద్దుతి రుగుడు పండించే రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని మార్కెటిం గ్, మార్క్ ఫెడ్ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.కనీస మద్దతు ధర ( రూ. 6760) కంటే తక్కువ ధరకు తొందరపడి విక్రయించవద్దని రైతులకు మంత్రి సూచించారు.

## ఈ నెల 27న లేదా 29వ తేదీన గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పతకాలు అమలు

హైదరాబాద్ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): త్వరలోనే మరో రెండు గ్యారంటీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాలను ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 27న లేదా 29వ తేదీన ఈ గ్యారంటీలను గవర్నమెంట్ ప్రారంభించనుంది.

ఈ మేరకు గ్యారంటీల అమలుకు సంబంధించిన విధి విధానాలపై కేబినెట్ సబ్ కమిటీతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.గృహజ్యోతి పథకానికి అర్హులైన వారి మార్చి మొదటి వారంలో జీరో బిల్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. లబ్దిదారులు రూ.500 చెల్లిస్తే సిలిండర్ అందించేలా ప్రణాళిక సిద్ధం సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాలని సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. కొత్త దరఖాస్తు చేయాలనుకునేవారు ఎంపీడీవో, తహశీల్దార్ ఆఫీసుల్లో అప్లై చేసుకోవచ్చని సూచించారు.



## కరెంట్ కట్ చేస్తే సస్పెండ్ చేస్తాం.. విద్యుత్ సిబ్బందిపై సీఎం రేవంత్ ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 22:విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అకారణంగా కరెంట్ కట్ చేస్తే సస్పెండ్ చేస్తామన్నారు.

ప్రభుత్వం ఎక్కడా విద్యుత్ కోతలు విధించట్లేదు.. కొందరు సిబ్బంది ఉద్దేశపూర్వకంగా కోతలు పెడుతున్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ఈ కుట్రలను సహించేది లేదని హెచ్చరించారు.

అవసరాలకు సరిపడేంత విద్యుత్ ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ప్రభుత్వం తరుపున ఎక్కడా విద్యుత్ కోతలు లేవన్నారు. కొంత మంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని సీరియస్ అయ్యారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పెరిగిందన్నారు.

## కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో టెక్నికల్ కమిటీని నియమించాలి : మంత్రి ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22:రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో వైద్య సేవలు అందించేందుకు టెక్నికల్ కమిటీని నియమించాలని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం తెలంగాణ సచివాలయంలోని తన కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

వరంగల్, హైదరాబాద్ లోని అల్వాల్, ఎల్బీనగర్, సనత్ నగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ల నిర్మాణ పనుల పురోగతి తో పాటు ఎర్రమంజిల్ లోని నిమ్స్ హాస్పిటల్‌లో 2వేల బెడ్స్ సామర్థ్యం తో నిర్మిస్తున్న విస్తరణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకు రావాలని సూచించారు.వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి మెరుగైన వైద్య సేవల కోసం వచ్చే రోగులకు అందించే చికిత్సలపై టెక్నికల్ కమిటీని నియమించాలని ఆదేశించారు. టెక్నికల్ కమిటీ సూచించిన విధంగా ఆయా ఆస్పత్రులలో స్పెషాలిటీ సేవ లను, చికిత్సలు అందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు ఆర్ అండ్ బీ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు .

## ఇంటర్‌నేషనల్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్స్ : డిప్యూటీ సీఎం

హైదరాబాద్, ఫిబ్రవరి 22:ఇంటర్ నేషనల్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణాలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యాశాఖ అధికారులను అదేశించారు. గురువారం అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాలపై విద్యాశాఖ ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ వార్షిక సంవత్సరంలో రూ. 2500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 100 ఎస్సీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం చేపడుతున్నామని , ఒక్కో రెసిడెన్షియల్ భవనానికి ప్రభుత్వం రూ.25 కోట్లు చొప్పున మంజూరు చేసిందన్నారు.

ఇప్పటి వరకు రెసిడెన్షియల్ పాఠశాలలు వేర్వేరుగా ఉన్నట్టుగా కాకుండా ఇక ముందు నిర్మించే భవనాలు ఒక చోట ఉండే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ఒకే చోట భవనాల వల్ల స్థల సమస్యను అధిగమించ వచ్చని, అన్ని సామాజిక వర్గాల విద్యార్థుల్లో సోదర భావాన్ని పెంపొం దించి కుల రహిత సమాజానికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు.

ఇంటిగ్రేటేడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం కోసం మధిర నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టు గా ఎంపిక చేశామని వెల్లడించారు.

రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణం త్వరగా నిర్మించడానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ప్లానింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అబ్దుల్ నదీంను ఆదేశించారు.

ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కోచింగ్ సౌకర్యం కోసం నాలెడ్జ్ కేంద్రాలను నియోజకవర్గ కేంద్రాల వారీగా ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

## తెలంగాణ పోరాటంలోనూ.. సమ్మక్క సారలమ్మల స్ఫూర్తి ఇమిడి ఉంది : కేసీఆర్




మేడారం ఫిబ్రవరి 22 తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చారిత్రక ప్రతీకలుగా, ఇలవేల్పులుగా సబ్బండ వర్గాల చేత పూజలందుకుంటున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. రెండేండ్లకోసారి జరిగే మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద అడవిబిడ్డల జాతరగా తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిందని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కొనసాగిన ఆత్మగౌరవ పోరాటంలోనూ సమ్మక్క సారలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని ఈ సందర్భంగా కేసీఆర్ పేర్కొన్నారు. ఒకనాడు కల్లోలిత ప్రాంతంగా నాటి సమైక్య పాలకుల ఏలుబడిలో అలజడులకు గురైన గోదావరి లోయ పరివాహక ప్రాంతం నేడు సాగునీటి జీవజలంతో సస్యశ్యామలమై ప్రజల జీవితాల్లో సాంత్వన నింపిందని అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి దేశవ్యాప్తంగా తల్లుల దర్శనార్థం కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా చూడాలని వనదేవతలను ప్రార్థించారు.

## ఆబ్కారీ అధికారులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, ఫిబ్రవరి 22: గంజాయి, మద్యం అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ఆబ్కారీ శాఖ అధికారులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. తెలంగాణ ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ శాఖ గజెటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ ని గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కోటిక్స్ నియంత్రణకు బహుముఖ వ్యూహం అవలంబించడంతో పాటు ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, నైపుణ్యతను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని పేర్కొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని అన్నారు. ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ శాఖ గజెటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జే. హరికృష్ణ, జనరల్ సెక్రటరీ సీహెచ్. విజయ్, ట్రెజరర్ డి. శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ కృష్ణ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## వన దేవతలకు పూజలు చేసిన కిషన్ రెడ్డి



మేడారం ఫిబ్రవరి 22: సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా ఇవాళ అమ్మవార్లను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అంతకు ముందు ములుగు జిల్లాలో పర్యటించిన ఆయన గిరిజన ఆరాధ్య దైవం గట్టమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం కేంద్రీయ విశ్వ విద్యాలయానికి ఎంపిక చేసిన స్థలాన్ని కూడా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి బీజేపీ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా గిరిజన రిజర్వేషన్లు అమలు చేస్తామని పేర్కొన్నారు. ములుగులో గిరిజన వర్సిటీ తాత్కలిక క్యాంపస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్సిటీలో ఎక్కువ సీట్లు తెలంగాణ విద్యార్థులకు కేటాయించేలా చూస్తామని పేర్కొన్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా నిర్వహించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

## అగ్ని ప్రమాద ఘటనపై విచారణకు ఆదేశించాం : మంత్రి పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 22: సిద్దిపేటలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సబ్‌స్టేన్‌లో అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. పీటీఆర్ పేలిపోవడం వల్లే సబ్ స్టేషన్‌లో ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. మూడు అగ్నిమాపక యంత్రాలతో మంటలు ఆర్పామన్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని పేర్కొన్నారు.

జరిగిన ప్రమాదంపై విచారణకు ఆదేశించామని మంత్రి చెప్పారు. కాగా, సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి 7గంటల ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ఈ ప్రమాదంతో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి.

సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు రేగాయి. దీంతో స్థానికులు భయ భ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. విద్యుత్ ట్రిప్ కావడంతో ప్రమా దం జరిగినట్లు తెలుస్తోంది.

**నేటి కందం- నేటికి అందం**

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

మారిన సంఘములో-చే
జారిన మోదమును మరల చక్కగ నొసగన్
తీరుగ జరుపంగ వలయు
కూరిమితో నింద్రజాలికుల దివసంబున్
(ఫిబ్రవరి 23 ఇంద్రజాలికుల దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

## సందేశ్‌ఖాలీ మహిళా బాధితుల్ని కలుసుకోనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో మహిళలను స్థానిక టీఎంసీ నేత వేధించిన విషయం తెలిసిందే. ఆ సంఘటన ప్రస్తుతం రాజకీయ దుమారం రేపుతున్నది. అయితే మార్చి 6వ తేదీన ప్రధాని మోదీ బెంగాల్‌లో టూర్ చేయనున్నారు. ఆ రోజున ఆయన సందేశ్‌ఖాలీ మహిళా బాధితుల్ని కలుసుకోనున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మహిళా వింగ్‌తో జరనున్న భేటీలో పాల్గొననున్న మోదీ.. అదే సమయంలో సందేశ్‌ఖాలీ బాధితుల్ని కలుసుకుంటారు.నార్త్ 24 పరగనాస్ జిల్లాలోని సందేశ్‌ఖాలీలో టీఎంసీ నేత మహిళల్ని లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ నేతకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించారు.

దీంతో ఆ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. టీఎంసీ నేత షేక్ షాహజహాన్ , అతని అనుచరులు దుర్మార్గాలకు పాల్పడ్డారు. భూములు లాక్కున్నారు. బెదిరింపులకు పాల్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే డబ్బును లాగేసుకునేవారని ఆ ముఠాపై ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల ఈడీ అధికారులు అతని ఇంటి వద్దకు తనిఖీ కోసం వెళ్లారు. ఆ సమయంలో అధికారులపై అటాక్ జరిగింది. ప్రస్తుతం ఆ టీఎంసీ నేత పరారీలో ఉన్నాడు.


ఆహ్వానము

CULTURE IS LOVE OF HUMANITY
GVR CULTURAL FOUNDATION

జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
నవరత్న మహిళా పురస్కారాల ప్రదానోత్సవం

ముఖ్య అతిథి :
శ్రీ పి. విజయబాబు
అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం,
ఆంధ్ర ప్రదేశ్ భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ.

సభాధ్యక్షులు
లయన్ డా॥ చిల్లా రాజశేఖర్ రెడ్డి
పారిశ్రామికవేత్త

సభాప్రారంభం
శ్రీ జమలాపురం రాధాకృష్ణ
లఘుచిత్ర నిర్మాత

సంగీత కళాకారుల సత్కారం
డా॥ టి. విజయభాస్కరరెడ్డి
న్యాయవాది, ప్రొఫెషర్ (న్యాయశాస్త్రం)

పురస్కార స్వీకర్తల స్వాగత సత్కారం
శ్రీమతి రామరాజు లక్ష్మీశ్రీనివాస్
డా॥ సి. నారాయణరెడ్డి
స్వర్ణకంకణ స్వీకర్త, ప్రముఖ వీణా విద్వాంసురాలు, గుంటూరు

అతిథుల సత్కారం
డా॥ లయన్ ఎస్. రామచంద్ర రావు
ఛైర్మన్, ఎస్. ఆర్. ఆర్. చారిటబుల్ ఫౌండేషన్

గౌరవ అతిథి
డా॥ ఎల్. జయంతిరెడ్డి
ఛైర్మన్, జె.జె. హాస్పిటల్

జ్యోతి ప్రకాశనం
శ్రీమతి కె. విజయలక్ష్మి
పారిశ్రామికవేత్త

ఆత్మీయ అతిథి
డా॥ కె. వీరభోగ వసంతరాయులు
కళాపోషకులు

తేది : 11-03-2024, సోమవారం, సా॥ 5.30 గం॥లకు
శ్రీత్యాగరాయ గానసభ (ప్రధానమందిరం), చిక్కడపల్లి, హైదరాబాద్.

గుదిబండి వెంకటరెడ్డి
ఛైర్మన్ - 9849882783

లయన్ వి.వి.రాఘవ రెడ్డి
ప్రధాన కార్యదర్శి - 9866332738

# భాగస్వామ్య విలువలు, ఉమ్మడి ప్రయోజనాలకు కట్టుబడి, భారత్-అమెరికా దేశాలు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కీలక భాగస్వాములుగా ఉన్నాయి-శ్రీ గిరిధర్ అరమనే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:భాగస్వామ్య విలువలు మరియు ఉమ్మడి ప్రయోజనాలకు కట్టుబడి, ఇండో–పసిఫిక్ ప్రాంత సంక్లిష్ట గతిశీలతను ముందుకు తీసుకువెళ్తూ, భారత్–అమెరికా దేశాలు ఈ ప్రాంతంలో కీలక భాగస్వాములుగా ఉన్నాయని, రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ గిరిధర్ అరమనే పేర్కొన్నారు. న్యూఢిల్లీలో 2024 ఫిబ్రవరి, 21వ తేదీన జరిగిన ఇండస్–ఎక్స్ సదస్సు రెండవ ఎడిషన్ లో ఆయన ప్రసంగించారు.

ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ, "ఈ రోజు, ఇండో–పసిఫిక్ ప్రాంత చరిత్రలో ఒక కీలక ఘట్టాన్ని మనం చూస్తున్నాము. ఇండో–పసిఫిక్ ప్రాంతం, దాని విస్తారమైన సముద్రాలు, వ్యూహాత్మక జలమార్గాలతో, ప్రపంచ వాణిజ్యం, భౌగోళిక రాజకీయాలు, భద్రతకు కేంద్ర బిందువుగా నిలిచింది. భాగస్వామ్య విలువలు, సాధారణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్న భారత్–అమెరికా దేశాలు ఈ ప్రాంత సంక్లిష్ట గతిశీలతను ముందుకు నడిపించడంలో, తమను తాము కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దుకున్నాయి." అని పేర్కొన్నారు.

పరస్పర గౌరవం, వ్యూహాత్మక కలయికతో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న పటిష్టమైన రక్షణ భాగస్వామ్యం గురించి శ్రీ గిరిధర్ అరమనే ప్రముఖంగా పేర్కొంటూ, 2022 సంవత్సరంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంయుక్తంగా ప్రారంభించిన క్లిష్టమైన, నూతన సాంకేతిక కార్యక్రమాలు (ఐ.సి.ఈ.టి) గురించి ప్రస్తావించారు. "మన మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధాల్లో ఐ.సి.ఈ.టి. ఒక ముఖ్యమైన అంశం. ఎక్స్–పో లు, హ్యాకథాన్ లు, పిచింగ్ సెషన్ల ద్వారా రక్షణ తో సహా కీలక రంగాల్లో 'ఇన్నోవేషన్ బ్రిడ్జి' లను స్థాపించాలని ఇది లక్ష్యంగా పెట్టుకుంది." అని ఆయన వివరించారు.

రక్షణ రంగంలో భారత్, అమెరికా దేశాలకు చెందిన అంకుర సంస్థల మధ్య సహకారానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తున్న ఐ.సి.ఈ.టి. ముఖ్యమైన ఫలితం అయిన "డిఫెన్స్- ఇన్నోవేషన్–బ్రిడ్జి" గురించి కూడా ఆయన తెలియజేశారు.

రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సహ అభివృద్ధి, సహ–ఉత్పత్తి కార్యక్రమాలను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా సంయుక్త ఇంపాక్ట్ సవాళ్లను ప్రవేశపెట్టడం ఒక విలక్షణమైన విధానమని రక్షణ శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. "మార్గదర్శక పరిష్కారాలలో చురుకుగా పాల్గొన్న అంకుర సంస్థల విలీనం ఈ భాగస్వామ్య శక్తి, సామర్థ్యాల నూతన విధానాన్ని పరిచయం చేస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యం గురించి శ్రీ గిరిధర్ అరమనే మాట్లాడుతూ, "మన ద్వైపాక్షిక సంబంధం వృద్ధి చెందుతోంది, అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం కోసం భారత దేశం ఎక్కువగా అమెరికా వైపు మొగ్గు చూపుతోంది. అందుకు ప్రతిగా అమెరికా తన ఇండో–పసిఫిక్ వ్యూహంలో భారతదేశాన్ని కీలక భాగస్వామిగా చూస్తూ, భారతదేశ పెరుగుతున్న రక్షణ సామర్థ్యాలను వినియోగించుకుంటోంది." అని వివరించారు. ఇరు దేశాలు భాగస్వాములుగా ఉన్న బహుపాక్షిక ఒప్పందాల గురించి కూడా ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

విమాన వాహకాలతో సహా నౌకా నిర్మాణం మొదలుకొని తేజస్ మల్టీ–రోల్ యుద్ధ విమానాల వంటి అధునాతన ఆయుధ సామాగ్రి అభివృద్ధి వరకు, అదేవిధంగా, ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షించిన దాడితో పాటు ఇతర అవసరాలకు వినియోగించే యుద్ధ హెలికాప్టర్ల అభివృద్ధి వరకు భారతదేశ రక్షణ ఉత్పత్తులకు సంబంధించిన విజయగాధలను రక్షణ శాఖ కార్యదర్శి ప్రముఖంగా వివరించారు.

వ్యూహాత్మక ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టపరచాలనీ, సహకారం విషయంలో పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవాలనీ, ఈ సదస్సులో పాల్గొన్న భారత్–అమెరికా దేశాలకు చెందిన వివిధ పరిశ్రమల ప్రతినిధులతో పాటు ఇతర భాగస్వాములకు శ్రీ గిరిధర్ అరమనే పిలుపునిచ్చారు. "మన బలాలు, సామర్థ్యాలను ఉపయోగించుకోవడం ద్వారా, భారత్–అమెరికా దేశాలు ఇండో–పసిఫిక్ ప్రాంతానికి చెందిన భౌగోళిక, రాజకీయ ప్రకృతి దృశ్యాన్ని రూపొందించడంతోపాటు, ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించగలవు" అని ఆయన చెప్పారు.

ఇండస్–ఎక్స్ సదస్సుకు చెందిన క్యాప్–స్టోన్–సెషన్ లో రక్షణ శాఖ కార్యదర్శి పాల్గొన్నారు. ఇండోపాకామ్ కమాండర్ అడ్మిరల్ జాన్ సి అక్విలినో, యు.ఎస్.ఐ.బి.సి. అధ్యక్షుడు ఏ.ఎం.బి. అతుల్ కశ్యప్ కూడా హాజరైన ఈ సెషన్ కు ది ఆసియా గ్రూప్ అధ్యక్షుడు మిస్టర్ రెక్సన్ ర్యా సమన్వయకర్త గా వ్యవహరించారు.

2024 ఫిబ్రవరి 20, 21 తేదీల్లో న్యూఢిల్లీ లో జరిగిన ఇండస్–ఎక్స్ సదస్సు రెండవ ఎడిషన్ను భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్నోవేషన్స్–ఫర్–డిఫెన్స్–ఎక్సలెన్స్ (ఐ.డీ.ఈ.ఎక్స్), అమెరికా రక్షణ శాఖ (డి.ఓ.డి) సంయుక్తంగా నిర్వహించాయి. కాగా, ఈ కార్యక్రమాన్ని అమెరికా–భారత వ్యాపార మండలి (యూ.ఎస్.ఐ.బీ.సీ), భారత రక్షణ తయారీదారుల సంఘం (ఎస్.ఐ.డీ.ఎం) సంయుక్త సమన్వయంతో నిర్వహించారు. భారత్–అమెరికా దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం విస్తృతమైన నేపథ్యంలో రక్షణ రంగంలో సాంకేతిక ఆవిష్కరణల కీలకపాత్రను ఈ సదస్సు నొక్కి చెప్పింది.

సరిహద్దుల్లో రక్షణ పరిశ్రమలకు ఉమ్మడి పురోగతిని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో, ముఖ్యంగా అంకుర సంస్థలు, ఎం.ఎస్.ఎం.ఈ. ల సాంకేతిక సామర్థ్యాలను ఒకే స్థాయి లోకి తీసుకురావడం కోసం, రెండు రోజుల పాటు నిర్వహించాలని తలపెట్టిన ఈ మార్గదర్శక ఇండస్–ఎక్స్ సమ్మిట్ 2024 ను రూపొందించడం జరిగింది. అలాగే, ఇండస్–ఎక్స్ పరిధిలో వివిధ సంబంధిత లక్ష్యాలపై చర్చలు, ద్వైపాక్షిక సంభాషణల్లో పాల్గొనడంతో పాటు, సంబంధిత ఫలితాలను, ఇండస్–ఎక్స్ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి తగిన చర్యలను ప్రతిపాదించాలనే ఉద్దేశ్యంతో కూడా ఈ సదస్సును రూపొందించడం జరిగింది.

# 2024 జనవరి నాటికి, వార్షిక క్యాపెక్స్ లక్ష్యంలో 95.83% సాధించిన బొగ్గు రంగ పీఎస్‌యూలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేసే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేసేందుకు చురుగ్గా పని చేస్తున్నాయి. ఈ క్రమంలో, క్యాపెక్స్ (మూలధన వ్యయం) లక్ష్యాన్ని చేరడంలో ముందంజలో ఉన్నాయి. బొగ్గు రంగ సీపీఎస్ఈలు గత కొన్ని సంవత్సరాలుగా మూలధన వ్యయ లక్ష్యాన్ని అధిగమిస్తూనే ఉన్నాయి. ఎఫ్‌వై 2021–22లో, సీఐఎల్ & ఎన్ఐసీఐఎల్ తమ లక్ష్యంలో వరుసగా 104.88% & 123.33% సాధించాయి. ఎఫ్‌వై 2022–23లోనూ అదే పనితీరు పునరావృతమైంది. ఆ సంవత్సరంలో ఆ రెండు సంస్థలు లక్ష్యంలో దాదాపు 113% సాధించాయి.

2023–24 కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ మూలధన వ్యయ లక్ష్యం రూ.21,030 కోట్లు. 2024 జనవరి నాటికి, రూ.20,153 కోట్ల పెట్టుబడులు పూర్తయ్యాయి. వార్షిక లక్ష్యంలో ఇది 95.83%కు సమానం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24లో, సీఐఎల్ & ఎన్ఐసీఐఎల్ మరోమారు క్యాపెక్స్ లక్ష్యాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం చివరి రెండు నెలల్లో పెద్ద పెట్టుబడులు కార్యరూపం దాల్చడంతో, సీఐఎల్ & ఎన్ఐసీఐఎల్ రెండు ఈసారి కూడా వార్షిక మూలధన వ్యయ లక్ష్యాలను అధిగమిస్తాయని అంచనా వేస్తున్నారు.

దేశ ఆర్థిక వృద్ధిని నడిపించే కీలకాంశాల్లో మూలధన వ్యయం ఒకటి. ఇది, ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. వినియోగం, డిమాండ్, పారిశ్రామిక వృద్ధిని పెంచుతుంది. ఉపాధి, దీర్ఘకాలిక మౌలిక సదుపాయాలను సృష్టిస్తుంది.

# జంతువుల పట్ల సానుభూతితో కూడిన వైఖరి అవసరం - శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:వన్యప్రాణుల పట్ల సానుభూతితో కూడిన విధానంతో పాటు అప్రమత్తంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా కొనసాగుతున్న మానవ– జంతు సంఘర్షణను పరిష్కరించవచ్చని కేంద్ర పర్యావరణం, అడవులు, పర్యావరణ మార్పు మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

బుధవారం ఉదయం బెంగళూరులు, కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ, జంతు–మానవ సంఘర్షణ కొనసాగుతోందని తమ దృష్టికి వచ్చిందని, ముఖ్యంగా వాయ్‌నాడు, బందీపూర్– వాయ్‌నాడు సరిహద్దు ప్రాంతాలలో ఇది ఎక్కువగా ఉన్నట్టు తెలిసిందని శ్రీ యాదవ్ అన్నారు. కొనసాగుతున్న మానవ–జంతు సంఘర్షణను పరిష్కరించేందుకు, మనం ఎంతో అప్రమత్తంగా సాంకేతికతను ఉపయోగించడంతో పాటు జంతువుల పట్ల సానుభూతితో కూడిన విధానాన్ని అనుసరించాలని అన్నారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం సలహా సూచనలను జారీ చేస్తోందని కేంద్ర మంత్రి చెప్పారు.

# ఏఐఎంఏ 68వ వ్యవస్థాపక దినోత్సవం & 18వ 'జాతీయ నిర్వహణ దినోత్సవం'లో కేంద్ర మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగం




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:సమగ్ర విజ్ఞానాన్ని దేశ నిర్మాణానికి ఉపయోగించాలని, భవిష్యత్ తరాలకు కూడా అందించాలని కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి & వ్యవస్థాపకత శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. 2027 నాటికి భారతదేశం 3వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ఫలితంగా అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

'ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్' (ఏఐఎంఏ) 68వ వ్యవస్థాపక దినోత్సవం & 18వ 'జాతీయ నిర్వహణ దినోత్సవం'లో పాల్గొన్న కేంద్ర మంత్రి, ఆహుతులను ఉద్దేశించి ప్రసంగించారు. సమర్థ నిర్వహణ, ప్రజాసేవ, ఆలోచనాత్మక నాయకత్వం విభాగాల్లో పురస్కారాలు అందుకున్న పరిశ్రమ ప్రముఖులను కేంద్ర మంత్రి అభినందించారు.

త్వరలో వచ్చే అవకాశాలను ఉపయోగించుకోవడానికి, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడానికి ఉమ్మడి ప్రణాళికను రూపొందించడం మన ముందున్న సవాలు అని శ్రీ ప్రధాన్ అన్నారు.

వచ్చే 25 ఏళ్లలో భారతదేశం తిరుగులేని శక్తిగా మారుతుందని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. విద్య నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు అన్ని సానుకూలతలు భారతదేశంలో ఉన్నాయన్నారు. ఏఐఎంఏ వంటి కీలక సంస్థలు తమ పాత్రను పునర్నిర్వచించుకోవాలని, భారతదేశ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసేందుకు ప్రజలను లక్ష్యాల వైపు నడిపించేలా పరిధిని పునర్నిర్మించుకోవాలని సూచించారు. సంపదను సృష్టించేటప్పుడు బాధ్యతాయుత వ్యాపారం, ప్రజా సంక్షేమాన్ని మరిచిపోవద్దని చెప్పారు.

# డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ అమలు చేయనున్న కార్యక్రమం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ అమలు చేయనున్న కార్యక్రమం ( జీఐడిహెచ్) ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు.

ప్రపంచవ్యాప్తంగా జీఐడిహెచ్ వ్యవస్థను డబ్ల్యూహెచ్ఓ నిర్వహిస్తుంది. భారతదేశం అధ్యక్షతన గాంధీనగర్ లో 2023 ఆగస్టు 19 న జరిగిన జీ–20 దేశాల ఆరోగ్య శాఖల మంత్రుల సమావేశంలో భారతదేశం జీఐడిహెచ్ ను ప్రతిపాదించింది. భారతదేశం ప్రతిపాదనను అన్ని జీ–20 దేశాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి.జీఐడిహెచ్ అమలుకు అన్ని దేశాలు, అన్ని అంతర్జాతీయ సంస్థలు సహకారం అందించాలని జీ–20 సమావేశం కోరింది. జీఐడిహెచ్ ప్రారంభ సమావేశంలో ప్రసంగించిన డాక్టర్ మాండవీయ "డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణానికి భారతదేశం చేస్తున్న కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.జీఐడిహెచ్ ని అమలు చేయాలని నిర్ణయించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ విషయంలో భారతదేశం చేస్తున్న కృషిని గుర్తించింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన జీ–20 శిఖరాగ్ర సమావేశం ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో జీఐడిహెచ్ అమలు జరగాలని తీర్మానించింది." అని అన్నారు.

' ప్రపంచ దేశాల ముఖ్యంగా దక్షిణాది దేశాల ఆరోగ్య వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు రావడంలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ కీలకంగా ఉంటుంది. జీఐడిహెచ్ విజయవంతంగా అమలు జరగడానికి దేశాల మధ్య సహకారం అవసరం." అని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు. ఆగ్నేయ ఆసియా ప్రాంతంలో జీఐడిహెచ్ ని అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రపంచ ఆఆరోగ్య సంస్థ – ఆగ్నేయ ఆసియా డైరెక్టర్ కు డాక్టర్ మాండవీయ విజ్ఞప్తి చేశారు.

డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణానికి భారతదేశం అమలు జరుగుతున్న కార్యక్రమాలను డాక్టర్ మాండవీయ వివరించారు. ' డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణానికి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం జరుగుతోంది" అని డాక్టర్ మాండవీయ తెలిపారు.

జీఐడిహెచ్ అమలుకు భారత దేశం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని డాక్టర్ మాండవీయ హామీ ఇచ్చారు. జీఐడిహెచ్ అమలు, అభివృద్ధి, సుస్థిరత కు భారతదేశం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచ స్థాయిలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ అభివృద్ధి కోసం జరుగుతున్న ప్రయత్నాలకు సభ్య దేశాలు సహకరించాలని ఆయన కోరారు. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ అందించడానికి డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ వీలు కల్పిస్తుందన్నారు.

2023 ఆగస్టు 19న గాంధీనగర్ లో జరిగిన జీ–20 ఆరోగ్య శాఖల మంత్రుల సమావేశంలో జీఐడిహెచ్ ని భారతదేశం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రారంభించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షణలో జీఐడిహెచ్ అమలు జరుగుతుంది. డిజిటల్ ఆరోగ్య రంగంలో ఇటీవల సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకుని 2020–2025 డిజిటల్ ఆరోగ్య లక్ష్యాలను సాధించడానికి పారదర్శకంగా,జవాబుదారీతనంతో జీఐడిహెచ్ ను అమలు చేస్తారు. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు ఎక్కువ చేయడానికి జీఐడిహెచ్ కృషి చేస్తుంది. ప్రజారోగ్యం కోసం ఒక వేదికగా జీఐడిహెచ్ పనిచేస్తుంది. నిధులు, వనరుల సమీకరణ కోసం జీఐడిహెచ్ ద్వారా ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యక్రమాలు అమలు చేస్తుంది. ఆరోగ్య రంగంలో సంపూర్ణ మార్పులు తీసుకు రావడానికి జరుగుతున్న ప్రయత్నాలకు జీఐడిహెచ్ సహకారం అందిస్తుంది.

# సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహారాజ్ జీకి శ్రద్ధాంజలిని ఘటించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహారాజ్ జీ సమాధి స్థితి లోకి పోవడం మనందరినీ దు:ఖితులను గా చేసివేసింది. విస్తారమైన జ్ఞానం, అపరిమితమైన కరుణ, మానవాళి ని ఉద్ధరించాలన్న అచంచలమైన నిబద్ధత తో ఆయన జీవితం ఆధ్యాత్మికంగా సుసంపన్నం అయింది. అనేక సందర్భాల లో ఆయన ఆశీస్సులు ప్రాప్తించిన గౌరవాన్ని నేను దక్కించుకొన్నాను. అందువల్ల నాతో సహా లెక్కలేనంతమంది కి మార్గాన్ని ప్రకాశవంతం గా మార్చివేసిన మార్గదర్శకమైనటువంటి కాంతి ని కోల్పోయినట్లుగా నేను తీవ్రమైన లోటు ను అనుభవిస్తున్నాను. ఆయన ఆప్యాయత, అనురాగం మరియు ఆశీస్సులు సుహృద్భావ సంకేతాలు మాత్రమే కాక ఆధ్యాత్మిక శక్తి ని ప్రసరింపజేసి, ఆయనతో సన్నిహితం గా మెలిగిన అదృష్టవంతులందరినీ శక్తివంతం చేసి, స్ఫూర్తిదాయకంగా కూడా నిలచాయి.

జ్ఞానం, కరుణ, సేవ అనే మూడు పాయల ను కలిగివున్న నది గా పూజ్య ఆచార్య జీ ని ఎప్పటికీ స్మరించుకోవడం జరుగుతుంది. ఆయన సిసలైనటువంటి తపస్వి, ఆయన యొక్క జీవనం భగవాన్ మహావీరుని ఆదర్శాలకు ప్రతీక. ఆయన జీవనం జైన మతం మూల సూత్రాలకు ఉదాహరణగా నిలచింది, దానిఆదర్శాలను తన స్వంత చర్యలు, బోధనల ద్వారా ప్రతిబింబింప చేశారు. సకల జీవరాశుల పట్ల ఆయనకున్న శ్రద్ధ జైన మతానికి జీవనం పట్ల ఉన్న అమితమైనటువంటి గౌరవానికి అద్దం పట్టింది. ఆలోచనలో, మాటలో, చేతల్లో నిజాయితీ కి జైన మతం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తూ ఆయన నిజాయతీ తో కూడిన జీవనాన్ని గడిపారు. ఆయన చాలా సరళమైన జీవనశైలి నికూడా అనుసరించారు. జైనమతం, భగవాన్ మహావీర్ జీవనం ల నుండి ప్రపంచం ప్రేరణ ను పొందింది అంటే దానికి ఆయన వంటి మహానుభావులు ఒక కారణం. జైన సముదాయం లో ఆయన ఉన్నత స్థానం లో నిలచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితం కాలేదు. మతాల కు, ప్రాంతాల కు, సంస్కృతుల కు అతీతం గా ప్రజలు ఆయన వద్దకువచ్చారు. ఆధ్యాత్మిక జాగృతి కి, మరీముఖ్యం గా యువత లో ఆధ్యాత్మిక జాగృతి కి ఆయన అవిశ్రాంతం గా కృషి చేశారు.

విద్య ఆయన హృదయాని కి చాలా దగ్గరైనటువంటి రంగం గా ఉండింది. విద్యాధర్ (ఆయన చిన్ననాటి పేరు) నుండి విద్యాసాగర్ వరకు ఆయన ప్రయాణం విజ్ఞానాన్ని సంపాదించడం, విజ్ఞానాన్ని అందించడంలో అకుంఠితమైన నిబద్ధత తో కూడుకున్నది. న్యాయమైన, విజ్ఞానవంతమైనసమాజాని కి విద్య మూలస్తంభం అని ఆయన ప్రగాఢం గా విశ్వసించారు. వ్యక్తుల ను సశక్తులను చేసే, వారు జీవనాన్ని పరమార్థం తో, సమన్వయంతో గడపడానికి వీలు కల్పించే ఒక సాధనం జ్ఞానం అని ఆయన నమ్మి, ఆ అంశాన్ని వ్యాప్తి లోకి తెచ్చారు. న్యాయమైన మరియు జ్ఞానోదయమైన సమాజానికి విద్య మూలస్తంభమని అతని దృఢ విశ్వాసం. స్వీయ–అధ్యయనానికి మరియు స్వీయ–చైతన్యానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాలని, అవే నిజమైన జ్ఞానానికి బాటలు అని ఆయన బోధ లు నొక్కిపలికాయి. జీవనపర్యంతం నేర్చుకొంటూనే ఉండడం మరియు ఆధ్యాత్మిక ఎదుగుదలలో నిమగ్నం కావడం చేయాలి అంటూ ఆయన బోధన లు ఆయన యొక్క అనుచరుల కు ఉగ్గుపాల మాదిరి గా రంగరించి పోశాయి.

అదే కాలం లో, సాంస్కృతిక విలువలతో ముడిపడి ఉన్న విద్యను మన యువత పొందాలి అని సంత్ శిరోమణి ఆచార్య విద్యాసాగర్ జీ మహారాజ్ జీ ఆకాంక్షించారు. నీటి ఎద్దడి వంటి కీలక సవాళ్లకు పరిష్కారాన్ని కనుగొనలేక పోయామని, గతం నుండి నేర్చుకొన్న పాఠాల కు దూరం గా ఉండడం వల్లే ఈ స్థితి ఏర్పడింది అని ఆయన తరచుగా చెప్పే వారు. నైపుణ్యం, నూతన ఆవిష్కరణల పై దృష్టి సారించేదే సంపూర్ణమైనటువంటి విద్య అని కూడా ఆయన నమ్మారు. భారతదేశం లో మాట్లాడే భిన్న భాషలంటే ఆయనకు అమిత గర్వం గా ఉండేది; యువతరం భారతీయ భాషల ను నేర్చుకోవాలి అంటే ఆయన ప్రోత్సహించారు.

పూజ్య ఆచార్య జీ స్వయం గా సంస్కృతం లోను, ప్రాకృత భాష లోను మరియు హిందీలోను విస్తృతంగా రచనలు చేశారు. ఒక సాధువుగా ఆయన చేరుకొన్న శిఖరాలు, భూమి మీద ఆయన ఎంత నమ్రం గా ఉండేవారో ఆయన యొక్క ప్రతిష్ఠాత్మక రచన మూకమతి లో స్పష్టం గా కనిపిస్తుంది. నిరాదరణ కు గురి అయినటువంటి వర్గాల వారికి ఆయన తన రచన ల ద్వారా వాణి ని అందించారు.

ఆరోగ్య సంరక్షణ రంగం లో కూడాను, పూజ్య ఆచార్య జీ చేసిన కృషి పరివర్తనాత్మకమైంది గా ఉంది. అనేక కార్యక్రమాల లో, విశేషించి పలువురు ఉపేక్షించినటువంటి ప్రాంతాల లో జరిగిన కార్యక్రమాల లో ఆయన పాలుపంచుకున్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయన విధానం సంపూర్ణమైనదిగా, శారీరికమైన శ్రేయస్సు ను ఆధ్యాత్మిక శ్రేయస్సు తో మిళితం చేసి, తద్వారా ఒక వ్యక్తి యొక్క పూర్తి అవసరాల ను తీర్చేదిగా ఉండింది.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ విద్యాసాగర్ జీ మహారాజ్ జీ దేశ నిర్మాణం పట్ల చూపిన నిబద్ధత ను గురించి రాబోయే తరాలు విస్తృతంగా అధ్యయనం చేయాలి అని నేను ప్రత్యేకం గా విన్నవిస్తున్నాను. పక్షపాత భరితమైనటువంటి ఆలోచనల కు అతీతంగా జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించాలి అని ప్రజలకు ఆయన సదా మనవి చేసే వారు. ప్రజాస్వామ్య ప్రక్రియల లో పాలుపంచుకోవడమే వోటు హక్కు ను వినియోగించుకోవడం అని ఆయన భావించినవందువల్ల వోటు ను వేయడం ముఖ్యం అని ఆయన గట్టి గా వాదించే వారు. ఆయన ఆరోగ్యకరమైనటువంటి మరియు స్వచ్ఛమైనటువంటి రాజకీయాలను సమర్థించారు, విధాన రూపకల్పన అనేది ప్రజా సంక్షేమాన్ని గురించే ఉండాలి అంతే తప్ప స్వీయ ప్రయోజనాల గురించి కాదు అని కూడా ఆయన చెప్పారు.

పౌరుల తమ పట్ల, తమ కుటుంబాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల బాధ్యతల విషయంలో తన పౌరుల నిబద్ధత పునాదులపై ఒక బలమైన దేశం నిర్మితమవుతుంది అని ఆయన విశ్వసించారు.

నిజాయితీ, చిత్తశుద్ధి, స్వావలంబన వంటి సుగుణాలను పెంపొందించుకోవాలి అని వ్యక్తులను ఆయన ప్రోత్సహించారు. ఇది న్యాయమైన, దయ కలిగిన, అభివృద్ధి చెందుతున్న సమాజం నిర్మాణానికి అవసరం అని ఆయన భావించారు. మనం వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నందున విధుల కు పెద్ద పీట ను వేయాలి అని పేర్కొనడానికి చాలా ప్రాముఖ్యం ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ క్షీణత విపరీతంగా ఉన్న ఈ కాలంలో, పూజ్య ఆచార్య జీ ప్రకృతి కి కలిగే హాని ని తగ్గించే జీవన విధానాన్ని అనుసరించాలి అంటూ పిలుపునిచ్చారు. అదేవిధంగా, మన ఆర్థిక వ్యవస్థ లో వ్యవసాయానికి అత్యంత ముఖ్యమైన పాత్రను ఇవ్వాలని ఆయన చెప్పారు. వ్యవసాయాన్ని ఆధునికమైందిగా, సుస్థిరమైందిగా మార్చాలి అని కూడా నొక్కి చెప్పారు. జైలు లో ఉండే వారి ని ఉద్ధరించే దిశలో ఆయన చేసిన కృషి కూడా చెప్పుకోదగింది.

వేల సంవత్సరాలుగా మన దేశం ఇతరులకు వెలుగు ను చూపించి మన సమాజాన్ని బాగు చేసిన మహానుభావులను అందించింది. సాధువులు, సంఘ సంస్కర్తల ఈ మహోన్నత వంశంలో పూజ్య ఆచార్య జీ మహోన్నత వ్యక్తి గా నిలుస్తారు. ఆయన ఏం చేసినా వర్తమానం కోసమే కాకుండా భవిష్యత్తు కోసం కూడా చేసే వారు. గత ఏడాది నవంబరు లో ఛత్తీస్ గఢ్ లోని

డోంగర్ గఢ్ లో చంద్రగిరి జైన మందిరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించింది. అప్పటి పూజ్య ఆచార్య జీ సందర్శన నా చివరి సమావేశం అవుతుంది అనే సంగతి ని నేను ఎరుగను. ఆ క్షణాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన నాతో చాలాసేపు మాట్లాడి, దేశానికి సేవ చేయడం లో నేను చేసిన కృషి ని ఆశీర్వదించారు. మన దేశం తీసుకుంటున్న దిశ పట్ల, ప్రపంచ వేదికపై భారతదేశాని కి లభిస్తున్న గౌరవం పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాను చేస్తున్న పని ని గురించి మాట్లాడేటప్పుడు ఆయన లో ఉత్సాహం తొణికిసలాడింది. అప్పుడు, ఎప్పుడూ వారి ప్రశాంతమైన చూపులు, చిరునవ్వు లు చాలు మనలో శాంతియుక్త భావన, ఒక పరమార్థం వంటివి రగుల్కొనడానికి. ఆయన దీవెన లు మనసు కు ఓదార్పు ను ఇచ్చే ఔషధం వలె, మనలోపల, బయట గల దైవీయమైనటువంటి ఉనికి ని గుర్తు చేసినట్లు అనిపించింది.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహారాజ్ జీ గురించి తెలిసినటువంటి వారు, ఆయన బోధనల నుండి, ఆయన జీవనం నుండి ప్రేరణ ను పొందినటువంటి వారు అందరూ ఆయన లేని లోటు ను భరించలేరు. ఏమైనా, ఆయన వల్ల స్ఫూర్తి ని పొందినటువంటి వారి హృదయాల లో ఆయన ఎప్పటికీ నిలచిపోతారు. ఆయన జ్ఞాపకాల ను గౌరవించడం కోసం, ఆయన బోధించిన విలువల ను ఆచరించడానికి మనం కట్టుబడి ఉందాం. ఈ విధం గా, మనం ఒక గొప్ప ఆత్మ కు నివాళి ని అర్పించడమే కాకుండా, మన దేశం కోసం మరియు మన ప్రజల కోసం ఆయన నిర్దేశించుకొన్నటువంటి లక్ష్యాన్ని కూడా ముందుకు తీసుకుపోదాం.

# మిలన్ 24 వేడుకలు .. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి, ఏపీ గవర్నర్



విశాఖపట్నం, ఫిబ్రవరి 22: తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్వహిస్తున్న మిలాన్ 24 వేడుకల్లో భాగంగా గురువారం విశాఖ ఆర్కే బీచ్ వేదిక సిటీ పరేడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి గదీప్ ధన్కర్ తో పాటు ఏపీ గవర్నర్ నజీర్, చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ ఆర్,.హరికుమార్, తూర్పు నౌకాదళం అధికారి రాజేష్ పెన్ధర్కర్, నేవీ ఉన్నతాధికారులు, ఫ్లాగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నే దేశ విదేశాల నుంచి వచ్చిన అధికారులు అంతా పొరుగు దేశాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ప్రతిబింబించే విధంగా చేపట్టిన యుద్ధ విన్యాసాలు తదితర కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు నేవీ కుటుంబానికి చెందిన ప్రతినిధులతో పాటు నగర ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో విశాఖ సాగర్ తీరం జనసంద్రంగా మారింది మరోవైపు ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

భారత ఉప రాష్ట్రపతికి ఆత్మీయ వీడ్కోలు

కాగా, భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కు ఐ.ఎన్.ఎస్ డేగాలో రాష్ట్ర గవర్నర్, నేవీ అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. గురువారం మిలాన్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మధ్యాహ్నం 12.30 గం.లకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్నారు. అక్కడ ఉప రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, తూర్పు నావికాదళ అధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, శాసన సభ్యులు పిజివిఆర్ నాయుడు (గణబాబు), పోలీస్ కమిషనర్ డా.ఎ.రవిశంకర్, నేవీ కమోడోర్ దిలీప్ సింగ్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ సమీర్ సక్సెనా, రెవెన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి భారత వైమానిక దళ ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.42 గం.లకు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

# పలిమెల జాన్ పున్నయ్యకు నివాళులర్పించిన వైరా ఆత్మ కమిటీ చైర్మన్



ఖమ్మం, ఫిబ్రవరి 22:(నేటి నిజం ప్రతినిధి): కొణిజర్ల మండలం లింగగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలిమెల జాన్ పున్నయ్య అనారోగ్యం కారణంగా అకాలమరణం పొందినారు. వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపిన వైరా ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, నాయకులు నల్లమోతు లక్ష్మయ్య, కందుల ఏడుకొండలు, వింజనీ రమేష్, యలమందల మధు, తూము అప్పారావు, అడపా మధుసూదన్, చల్లా బాబు, పందిళ్ళ కృష్ణ, కాంపెల్లి పిచ్చయ్య, పలిమేల పిచ్చయ్య, భాస్కర్, సాయి వంశీ,కందులలక్ష్మయ్య, పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజీనామా

తాడేపల్లి ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైఎస్సార్‌సీపీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజ్యసభ ఎంపీ, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరక సీఎం జగన్‌కి ఆయన లేఖ రాశారు. " ఆర్యా.. నేను నా వ్యక్తిగత కారణాల వలన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిలా పార్టీ అధ్యక్ష పదవికి, వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను. ఈ సందర్భంగా మీరు నాకు పార్టీలో అందజేసిన సహకారానికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అంటూ పార్టీకి రాజీనామా లేఖలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.ఇక రాజ్యసభ ఎంపీ పదవి కూడా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాజీనామా చేశారు. " నేను, నా వ్యక్తిగత కారణాల వలన నా రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని తెలియజేస్తున్నాను" అంటూ ఎంపీ పదవి రాజీనామా చేసిన లేఖలో పేర్కొన్నారు. ఇదిలావుండగా వేమిరెడ్డి భార్య ప్రశాంతి కూడా అధికార పార్టీకి బైబై చెప్పేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె టీటీడీలో కీలక పదవిలో ఉన్నారు. అయితే వీరిద్దరూ రాజకీయ భవిష్యత్ ప్రణాళికలపై క్లారిటీ రావాల్సి ఉంది.

# గాడి తప్పిన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ

-కొత్త అప్పుల ద్వారానే నిధులు సమకూర్చుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
-అందుకే ఢిల్లీలో కేంద్రమంత్రులను కలుస్తూ కాంగ్రెస్ నేతలకు వినతిపత్రాలు
-బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

హైదరాబాద్ ఫిబ్రవార్ వై 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణను అప్పుల పాలు చేసింది గత బీఆర్ఎస్ సర్కారు అయితే.. ఇప్పటికే ఎఫ్ఆర్బీఎం పరిమితులు మించి పోయినా .. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బడ్జెట్ లో కేవలం కొత్త అప్పుల ద్వారానే నిధులు సమకూర్చుకోవాలని భావిస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పడమే కాకుండా.. ఖజానా ఖాళీ అయ్యిందని తెలంగాణ ప్రభుత్వానికి కొత్తగా అప్పులు పుట్టే పరిస్థితి లేదని తెలిపారు. అందుకే ఢిల్లీలో కేంద్రమంత్రులను కలుస్తూ కాంగ్రెస్ నేతలు వినతిపత్రాలు సమర్పిస్తున్నారని ఎద్దేవా చేశారు. పాత బీఆర్ఎస్ ప్రభుత్వ అడుగుజాడల్లోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని ఆయన దుయ్యబట్టారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ గారు మాట్లాడారు. ఈ సందర్భంగా... తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలివ్వలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రానికి భారమయ్యే సలహాదారుల పదవులు, రాజకీయ నియామకాలు అవసరమా..? అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అడ్వర్టైస్మెంట్ల కోసం కోట్ల రూపాయల నిధులు ఖర్చు పెట్టడం సరికాదని,.. రాష్ట్ర ప్రభుత్వం అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాకు మరింత భారంగా మారేలా సలహాదారుల నియామకాలు, కార్పొరేషన్ చైర్మన్లను నియమిస్తూ ఆర్థిక క్రమశిక్షణను గాలికి వదిలేస్తోందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దృష్టిలో పెట్టుకొని రాజకీయ నియామకాలు ఆపివేయాలని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి నడుస్తున్నాయని చేస్తున్న అసత్యపు, అవాస్తవ ప్రచారాలు మానకపోతే క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రజాకోర్టులో బట్టలూడదీసి కొడుతామని హెచ్చరించారు. విజయ సంకల్ప యాత్రకు తెలంగాణ ప్రజల్లో అపూర్వ స్పందన వస్తుండడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తెలంగాణలో రెండు పార్టీల చిరునామా గల్లంతవుతుందనే భయం ప్రారంభమైందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయంతో మరోసారి నరేంద్ర మోదీ గారు ప్రధాని పదవి అధిష్టించాలనే కోరిక ప్రజల కండ్లల్లో బలంగా కనిపిస్తోందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. విజయ సంకల్ప యాత్రలతో రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాల్లో విజయం బిజెపిదేనని ధీమా వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో తాను పోటీ చేయనని గతంలోనే పార్టీ అధిష్టానానికి స్పష్టం చేసినట్లు తెలిపారు.కాంగ్రెస్ నేతలపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, కారు ఇచ్చిన వ్యక్తి లేదా తీసుకున్న వ్యక్తి స్పందిస్తే తప్పకుండా ఆధారాలు బయటపెడతానని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ వ్యాఖ్యానించారు. మధ్యలో ఎవరో మాట్లాడితే తాను స్పందించబోనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం మాణిక్యం ఠాకూర్, మాణిక్ రావు థాక్రేను ఎందుకు మార్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జనంలో తిరస్కరణకు గురైన వాళ్లు, విలువలు కోల్పోయినవాళ్లు.. పదవుల కోసం విమర్శలు చేస్తున్నారని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ వ్యాఖ్యానించారు. మాణిక్యం ఠాగూర్, ఠాక్రే మీద ఆరోపణలు, వాస్తవాలను బయట పెట్టింది? అధిష్టానానికి ఫిర్యాదు చేసింది కాంగ్రెస్ నాయకులు కాదా? ఆ తర్వాతే ఈ ఇద్దరు ఇంచార్జీలను మార్చింది వాస్తవం కాదా అనేదానిపై కాంగ్రెస్ అధిష్టానం సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులు జైలుకు పోతుంటే.. ఇంచార్జీలు ఇంటికి పోతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ కు కారు ఇచ్చిన వాళ్లైనా మాట్లాడాలి... లేదంటే తీసుకున్న వాళ్లైనా మాట్లాడాలి... అప్పుడే ఆధారాలు బయటపెడుతానని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సంస్కృతే బ్రీఫ్ కేసులు, ల్యాండ్ సెటిల్ మెంట్లు, కార్లు అంటూ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. ఈ విషయం దేశ ప్రజలందరికీ తెలుసన్నారు.

# సీఎం జగన్ మోహన్ రెడ్డి విష సంస్కృతిని కుటుంబాలకి కూడా వ్యాపించేలా చేశారు

## -జనసేన అధినేత పవన్ కళ్యాణ్

భీమవరం ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ ) సీఎం జగన్ మోహన్ రెడ్డి తాను అవలంబిస్తున్న విష సంస్కృతిని కుటుంబాలకి కూడా వ్యాపించేలా చేశారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. సొంత చెల్లికి న్యాయం చేయని వ్యక్తి ప్రజలకేం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. భీమవరంలో జనసైనికులతో పవన్ కళ్యాణ్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."బీసీ కులాల మధ్య సఖ్యత లేకపోవడంతోనే జగన్ దగ్గర దేహీ అనాల్సి వస్తోంది. జగన్ దగ్గర అధికారం ఉంది. అందుకే ఆయన చెప్పిందే వేదంలా పరిస్థితులు ఉన్నాయి. వీటిని మార్చాలి. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పడం తథ్యం. అణగారిన కులాలు అభివృద్ధి సాధించాలంటే, దాని అర్థం ఇతర కులాలను తొక్కేయడం కాదు. అన్ని కులాలను సాధికారత దిశగా తీసుకువెళ్లడం. రాజకీయాల్లో కూడా రిటైర్ మెంట్ అవసరం. కొత్తతరం వారికి అవకాశం ఇవ్వాలంటే, ఇది తప్పదు. జనసేన కొత్త తరం నాయకులకు అవకాశం ఇస్తుంది. దళితుడిని చంపిన వ్యక్తి జైలు నుంచి వస్తే పది వేల మందితో ఊరేగించారు. చంపింది ఒకరైతే మరోకులాన్ని వివాదంలోకి లాగారు. బంధుత్వం వేరు, రాజకీయం వేరు. మా అన్నయ్య చిరంజీవితో కొన్ని అంశాల్లో విభేదించి బయటకు వచ్చాను. మనుషులను జగన్ విడగొట్టారు. ఈ సంస్కృతి కుటుంబాలకు పాకింది. మాజీ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి సంపాదించిన ఆస్తుల్లో వాటాను చెల్లి షర్మిలకు జగన్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. అలాంటి వ్యక్తి ప్రజలకు ఏం మంచి చేస్తారు" అని పవన్ అన్నారు.

# బీసీలను జండాలు మోసే కూలీలు గానే వాడుకుంటున్న రాజకీయ పార్టీలు

-రాజ్యాధికారంలోబీసీలకు రావాల్సిన వాటా ఇవ్వకుండా అగ్రకుల పార్టీలు కుట్ర
-మహబూబ్ నగర్ పార్లమెంటు సీటును బీసీలకే కేటాయించాలి
- బీసీసేన సేన రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్



జడ్చర్ల ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అన్ని రాజకీయ పార్టీలు మహబూబ్ నగర్ పార్లమెంటు సీటును బీసీలకే కేటాయించాలన్న అంశంపై బీసీ సేన ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలోని చంద్ర ఫంక్షనల్ లో బీసీసేన సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్మెంట్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ప్రకాష్ యాదవ్,రైతు రాజ్యం పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎంబి బాలకృష్ణ మూడ మాజీ డైరెక్ట. బాద్మీరవిశంకర్,ఫకీర్ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జహంగీర్ పాషా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మచ్చుల శ్రీనివాస్ యాదవ్, పెద్ది వెంకటేష్, ప్రకాష్ చారి లు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల జండాలు మోసే కూలీలు గానే వాడుకుంటూ రాజకీయంగా ఎదుగు కుండా అణచివేస్తూ వార్డు మెంబర్ నుండి పార్లమెంటు స్థాయి వరకు, రాజ్యాధికారంలోబీసీలకు రావాల్సిన వాటా ఇవ్వకుండా అగ్రకుల పార్టీలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు, నవంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ జపం చేశాయి కానీ జనాభా దామాషా నిష్పత్తిన బీసీలకు అసెంబ్లీ సీట్లుకేటాయించకుండా రాజకీయంగా అణచివేశాయని అన్నారు. ఉద్యమ సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బి ఆర్ఎస్ పార్టీఉనికినికాపాడటానికి తన సొంత ఆస్తులను అమ్మి ఖర్చుపెట్టిన బెక్కం జనార్ధన్, చాలా ఏళ్ల నుండి, మహబూబ్ నగర్ అసెంబ్లీ నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉనికిని కాపాడుతున్న సంజీవ్ ముదిరాజ్ లకు అసెంబ్లీ సీటు కేటాయించ కుండ అవమానపరిచాయని పదిహేను సంవత్సరాలుగా మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజవర్గంలో తన సొంత ఖర్చులతో పార్టీకార్యక్రమాలను మరోవైపు సేవా కార్యక్రమాలను నిరంతరంనిర్వహిస్తున్నబండారి శాంతికుమార్ కు 2014-2019లో జరిగిన మహబూబ్ నగర్ పార్లమెంటు ఎన్నికలలో బిజెపి పార్టీ ఎన్నికలకు ముందు వలస వచ్చిన అగ్రకుల నాయకులకు పార్లమెంటు సీటు కేటాయించి తీరని అన్యాయం చేశారని, బీసీలుగా పుట్టడమే వాళు చేసుకున్న పాపమా అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బి ఆర్ఎస్, బిజెపి పార్టీల బాధ్యతలను భుజాలపై మోసిన, బండారి శాంతి కుమార్ ,బెక్కం జనార్దన్, సంజీవ్ ముదిరాజ్ లకు వచ్చే పార్లమెంటు ఎన్నికలలో ఆయా పార్టీలు పార్లమెంటు సీటును కేటాయించాలనిడిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికలలో బీసీలకు అన్యాయం చేసి బీసీఏ తరులకు సీటు కేటాయించే పార్టీలకు డిపాజిట్ కూడా దక్కకుండా తగిన బుద్ధి చెప్పాలని బీసీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో.బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎతి నే చెన్నయ్య ఫకీర్ హ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఫకీర్ జహంగీర్ పాష నాయి బ్రాహ్మణ సంఘం జడ్చర్ల పట్టణ అధ్యక్షులు నిరంజన్, గంగాపూర్ ఆంజనేయులు, బుద్ధ సముద్రం శంకర్, వీరేష్,బొల్లె మోని నిరంజన్, గొడుగు నర్సిములు, సురభి విజయ్ కుమార్, గోపాల్,మాచారం శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, మల్లేష్ లింగం పేట్ శేఖర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన న్యూఢిల్లీలో ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ ఎస్ డి సి) 28వ సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ ఎస్ డిసి) 28వ సమావేశం ఈ రోజు న్యూఢిల్లీలో జరిగింది.

స్థూల ఆర్థిక స్థిరత్వం, వాటిని ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధత తదితర అంశాలపై ఎఫ్ ఎస్ డి సి చర్చించింది. ప్రపంచంలోని ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాలలో ఒకటిగా ఎదగడానికి , దేశీయ ఆర్థిక వ్యవస్థకు విదేశీ మూలధనం, ఆర్థిక సేవలను సులభతరం చేయడంలో ప్రపంచంలోని ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాలలో ఒకటిగా జి ఐ ఎఫ్ టి ఐ ఎఫ్ ఎస్ సి వ్యూహాత్మక పాత్రకు మద్దతు ఇవ్వడానికి ప్రస్తుతం ఉన్న ఇంటర్ - రెగ్యులేటరీ సమస్యలపై కూడా చర్చించారు.

దేశీయ అంతర్జాతీయ స్థూల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న ఎఫ్ ఎస్ డి సి సభ్యులు నిరంతర నిఘాను కొనసాగించాల్సిన అవసరం ఉందని , అభివృద్ధి చెందుతున్న ఆర్థిక స్థిరత్వ ప్రమాదాలను గుర్తించడానికి, ఆర్థిక రంగం స్థితిస్థాపకతను నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి వారి క్రియాశీల ప్రయత్నాలను కొనసాగించాలని స్పష్టం చేసింది. సమ్మిళిత ఆర్థిక వృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులను అందించేలా ఆర్థిక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఇంటర్ రెగ్యులేటరీ సమన్వయాన్ని బలోపేతం చేయాలని ఎఫ్ ఎస్ డి సి సభ్యులు నిర్ణయించారు.

ఆర్ బి ఐ గవర్నర్ అధ్యక్షతన ఎఫ్ ఎస్ డి సి సబ్ కమిటీ చేపట్టిన కార్యక్రమాలు, ఎఫ్ ఎస్ డి సి గత నిర్ణయాలపై సభ్యులు తీసుకున్న చర్యలను కూడా ఎఫ్ ఎస్ డి సి పరిగణనలోకి తీసుకుంది.

ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కిషన్ రావు కరాడ్; - రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బి ఐ) గవర్నర్ శక్తికాంతదాస్; ఆర్థిక కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి, ఆర్థిక మంత్రిత్వ శాఖ (ఎం ఒ ఎఫ్) వ్యయ విభాగం కార్యదర్శి డాక్టర్ టి.వి. సోమనాథన్; ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి, ఎం ఒ ఎఫ్ , అజయ్ సేథ్, ఆర్థిక సేవల విభాగం ఎం ఒ ఎఫ్ కార్యదర్శి డాక్టర్ వివేక్ జోషి; రెవెన్యూ డిపార్ట్మెంట్, ఎం ఒ ఎఫ్ శ్రీ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా; కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసిఏ) కార్యదర్శి డాక్టర్ మనోజ్ గోవిల్ ; ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ ; కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్; సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఛైర్ పర్సన్ శ్రీమతి మాధాబి పూరి బుచ్; ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్ మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్ పర్సన్ శ్రీ దేబశిష్ పాండా; డాక్టర్ దీపక్ మొహంతి,పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్ పర్సన్ డాక్టర్ దీపక్ మొహంతి; ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా ఛైర్ పర్సన్ శ్రీ రవి మిట్టల్; ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ ఛైర్మన్, ఎఫ్ ఎస్ డి సి ఆర్థిక వ్యవహారాల విభాగం, ఎం ఒ ఎఫ్ కార్యదర్శి, కె. రాజారామన్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

# యాదాద్రి లక్ష్మీ నారసింహ్ముని సన్నిధిలో బీసి కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం

-"కుల సర్వే" తీర్మానం తో- చరిత్ర పుటలలో "రాష్ట్ర ప్రభుత్వం"
- కుల సర్వే తో తీరనున్న బీసీల చిరకాల డిమాండ్
-బలహీన వర్గాల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని లక్ష్మీ నారసింహ్మున్ని వేడుకున్నా..



యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); రాష్ట్రం లో సామాజిక, ఆర్థిక కుల సర్వే ను చేపట్టడానికి ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధం కావడం పట్ల రాష్ట్ర బీసి కమిషన్ చైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం లో బలహీన వర్గాల ప్రజలందరి, జనాభా లెక్కలను శాస్త్రీయంగా చేపట్టడానికి వీలుగా, ఇటీవల ప్రభుత్వం శాసనసభ లో తీర్మానం ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా ఆమోదం పచేసుకోవడం ఒక "చారిత్రాత్మక ప్రక్రియ" గా ఆయన కొనియాడారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కి, బీసి సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆయన ధన్యవాదాలు, అభినందనలు తెలియ చేశారు.బుధవారం నాడు సాయంత్రం డా.వకుళాభరణం కృష్ణమోహన్, కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీ నారసింహ స్వామి సన్నిధిలో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన రాక సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారులు అమరనాద్, వెంకటేశ్వర్లు, బీసి సంక్షేమ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చక స్వాములు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లన్ దిగాన్ లక్ష్మి నరసింహా చార్యులు, కాందూరి వెంకటా చార్యులు, అర్చక బృందం వేదాశీర్వచనాలు ఇచ్చారు, ఆలయ అధికారులు స్వామి వారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందచేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల పాత్రికేయులతో ఆయన కాసేపు మాట్లాడారు... బలహీన వర్గాలు ప్రధానంగా... చాలా ఏళ్ళుగా బీసీలు తమను లెక్కలు తీసి తదననుగుణంగా అన్ని రంగాలలో తమ వాటాను కోరుకుంటున్నారని అన్నారు. ఇన్నాళ్ళకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయించి, కార్యాచరణను మొదలుపెట్టడం గొప్ప శుభారంభం అన్నారు.విద్యార్ధి దశ నుండి ఒక ఉద్యమ నాయకుడిగా, నేడు బీసి కమిషన్ చైర్మన్ గా అనేక వేదికలలో "బీసి కుల గణన'' డిమాండ్ ను బలంగా వినిపించాను అన్నారు. కాగా తాను ప్రస్తుతం చట్టబద్దమైన హోదాలో ఉన్న, ఈ సమయం లో ప్రభుత్వం ఇంతటి మహత్తరమైన నిర్ణయం తీసుకోవడం ఒక అపూర్వ ఘట్టం గా తన జీవితంలో మిగులుతుందన్నారు. ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఈ కుల సర్వే కు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని, లక్ష్మీ నారసింహ్మున్ని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ సర్వే పూర్తై గణాంకాలు, సమాచారం ప్రభుత్వం అందుబాటులోకి వస్తే, బలహీనవర్గాలు ఆశించిన రీతిలో అభివృద్ధి లోకి రావడానికి మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# యూపీలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు ఖరారు

లక్నో ఫిబ్రవరి 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు ఖరారైంది. ఇండియా విపక్ష కూటమిలో భాగంగా ఇరు పార్టీలు ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించారు.పొత్తులో భాగంగా యూపీలో 17 ఎంపీ సీట్లను కాంగ్రెస్‌కు కేటాయించేందుకు అఖిలేష్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇరు పార్టీల మధ్య పొత్తుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారు. యూపీలో ఎస్పీ, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటుపై గత రెండు, మూడు రోజులుగా సంప్రది oపులు జరుగుతున్నాయి.అధిక స్థానా లకు కాంగ్రెస్ పట్టుబట్టడంతో సీట్ల సర్దుబాటులో జాప్యం నెలకొంది. ఇక ఇరు పార్టీల పొత్తుపై ఎస్పీ చీఫ్ అఖి లేష్ యాదవ్ ప్రకటించడంతో ప్రతిష్ఠంభన కు తెరపడింది. కాంగ్రెస్, ఎస్పీ మధ్య పొత్తు ఖరారు కావడంతో రా హుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేష్ యాదవ్ పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

# జాహ్నవి కేసులో అమెరికా కోర్టు తీర్పు..!

## -ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్

హైదరాబాద్ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అమెరికాలో తెలుగు విద్యార్థిని జాహ్నవి కందులను తన వాహనంతో ఢీకొట్టి చంపిన అమెరికన్ పోలీస్‌పై సరైన ఆధారాలు లేవంటూ అమెరికా కోర్టు విడుదల చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో అమెరికా రాయబార కార్యాలయం వెంటనే జోక్యం చేసుకొని అమెరికా ప్రభుత్వ వర్గాలతో మాట్లాడి జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కేటీఆర్ కోరారు. విదేశాంగశాఖ మంత్రి డాక్టర్ జయశంకర్ వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకొని, అమెరికా ప్రభుత్వంతో మాట్లాడి స్వతంత్రంగా ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిగేలా ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అనేక ఉన్నత లక్ష్యాలతో అమెరికా వెళ్లి ఈ ప్రమాదంలో చనిపోవడం అత్యంత విషాదకరమని.. అమెకి జరగాల్సిన న్యాయం జరగకుండా కేసు తేలిపోవడం అంతకన్నా బాధాకరవ న్నారు. గత సంవత్సరం జనవరిలో సియాటెల్ నగరంలో కెవిన్ డేవ్ అనే పోలీస్ అధికారి 115 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న తన కారు ఢీకొనడంతో జాహ్నవి మరణించింది. అయితే ఆ సంఘటన జరిగిన వెంటనే పోలీస్ అధికారి జరిగిన ప్రమాదం గురించి బాధపడకుండా.. వర్ధ వివక్షతో మాట్లాడుతున్న వీడియో వెలుగు చూసింది. దీంతో ఆ పోలీస్ అధికారి కావాలనే ఢీకొట్టి చంపారని.. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

# భక్తులతో కళకళలాడుతున్న మినీ మేడారం.. వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే పాయం



ఖమ్మం, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి): ఆదివాసుల ఆరాధ్యదైవం, నమ్మిన భక్తులకు వరాలు ఇచ్చే వన దేవతలైన సమ్మక్క-సారక్క జాతర మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన తోగ్గూడెం జాతర భక్తులతో కళకళలాడుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని, మణుగూరు మండలంలోని తోగ్గూడెం గ్రామంలో వెలిసిన సమ్మక్క సారక్క జాతరకు భక్తులు పోటెత్తారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మహా కుంభమేళాగా, ములుగు జిల్లా తాడ్వాయి మండలం లోని మేడారంలో జరుగుతున్న జాతరకు లక్షల మంది వాహనాలు ద్వారా జాతరకు తరలి వెళ్తున్నారు. మేడారం వెళ్ళలేని భక్తులు తోగ్గూడెం గ్రామంలో వెలిసిన సమ్మక్క, సారక్క దేవతలను వందలాది మంది భక్తులు



ఇక్కడ దర్శించుకొని మొక్కులను తీర్చుకుంటారు. ఎంతోమంది భక్తులు ఈ జాతరకు తరలివచ్చి చల్లంగా చూడాలి తల్లీ అంటూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. బుధవారం రోజు సారక్క, పగిడిద్దరాజులు గద్దెల పై కొలువుదీరగా, గురువారం సాయంత్రం సమ్మక్క తల్లి గద్దెకు చేరుకోనుంది. గిరిజన సాంప్రదాయాల మధ్య ఈ మహా జాతర ఆరంభమైంది. ఈ జాతర శుక్రవారం వరకు కొనసాగగా, శనివారం వన దేవతలైన సమ్మక్క, సారక్కలు వన ప్రవేశం చేయనున్నారు. ఆలయ కమిటి, సింగరేణి యాజమాన్యం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్ధం కొంతమంది దాతలు ఉచితంగా అన్న దానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్న చేపట్టారు. శివశక్తులు, దేవరలతో పాటు, భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతుంది. ఇప్పటికే మణుగూరు, అశ్వాపురం, పినపాక మండలాల నుండి అమ్మవారలను దర్శించుకుంటున్నారు. ఈరోజు సాయంత్రం సమ్మక్క తల్లిని గద్దె పైకి తోడ్కువచ్చేందుకు, ఆలయ కమిటీ, పూజారులు సర్వం సిద్ధం చేశారు. సమ్మక తల్లి రథం గుట్ట, అటవి ప్రాంతం నుండి జనారణ్యంలోకి వచ్చి భక్తులకు దర్శనం ఇవ్వనుంది. ఆ సమ్మక్క తల్లి రాక కోసం వందలాది మంది భక్తులు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. సమ్మక్క తల్లి వచ్చేటప్పుడు రహదారిపై ట్రాఫిక్ అంతారయం కలుగకుండా పలు వా హనాలను దారి మళ్ళించేందుకు మణు గూరు పోలీసు చర్యలు చేపట్టారు.

## వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే పాయం

తోగ్గూడెం గ్రామంలో కొలువైన అమ్మవారులైన సమ్మక్క, సారక్కలను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును, గిరిజన సంప్రదాయల మధ్య మర్యాద పూర్వకంగా ఆలయ కమిటి, పూజరులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు, మణుగూరు తహశీల్దార్ రాఘవ రెడ్డి, అమ్మవారలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి వారు ఎమ్మెల్యే పాయంకు తీర్థప్రసాదాలు అందించారు.

## జాతరకు కట్టుదిట్టమైన భద్రత..

జాతరకు వచ్చే భక్తులతో మినీ మేడారం అయిన తోగ్గూడెం గ్రామం కిటకిటలాడుతుండడంతో ట్రాపిక్ సమస్య తలెత్తకుండా మణుగూరు సి.ఐ సతీష్, ఎస్.ఐ రాజేష్, తన సిబ్బందితో కలిసి మళ్లింపు చర్యలు చేపట్టారు. హెవీ వాహనాలను మరోక మార్గం ద్వారా రాకపోకలు చేపట్టారు. ఆలయం ప్రాంతంలో ఎలాంటి గొడవలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చేపట్టడమే కాకుండా, సి.ఐ సతీష్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సమ్మక తల్లిని వనం నుండి ఊరేగిం పుగా తీసుకువచ్చే సమయంలో తొక్కిసలాట జరుగకుండా రోప్ వే సిబ్బందిని ఏర్పాటు చేశారు.

## వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం..

సమ్మక్క సారక్కల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులు నుండి అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. జాతర పూర్తయ్యే వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని వ్యవస్థాపక అధ్యక్షులు దోసపాటి వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ



కార్యక్రమంలో దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి రాము, దోసపాటి పిచ్చేశ్వరరావు, వాసవి క్లబ్ జిల్లా అధ్యక్షులు చారుగుళ్ళ శ్రీనివాస్, మణుగూరు క్లబ్ అధ్యక్షులు కేశ ప్రసాద్, మిట్టపల్లి శ్యామ్, పాల్గొన్నారు.

# ఆడపిల్లలుపై చదువులు చదివి ఎదిగేలా ప్రోత్సహించాలి

బాల్య వివాహాలు నిర్మూలించాలి,
ఆడపిల్ల పై వివక్షకు 1098 టోల్ ఫ్రీ నంబర్ లో పిర్యాదు చేయాలి,
బేటి బచావో బేటి పడావో సమీక్ష సమావేశంలో
-జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

మెదక్, ఫిబ్రవరి 22(నేటినిజం ప్రతినిధి):స్థానిక కలెక్టర్ కార్యాలయం లోని విడియో కాన్ఫరెన్స్ హల్ లో గురువారం బెటి పడవో బెటి బచావో కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష జాఢ్యాన్ని రూపుమాపాలంటే వ్యవస్థలో మార్పు రావాలని అందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్దులు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆడపిల్లలను రక్షించడం, చదివించడం వలన సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆడపిల్లలు వివక్షకు గురవుతున్నారని అన్నారు. ఈ జాఢ్యాన్ని రూపుమాపాలంటే ముందు కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్దులు కావాలని అన్నారు. అమ్మయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని, బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. పాఠశాలలలో విద్యార్థి, విద్యార్థినిలకు చట్టాలపై అవగాహన, ప్రతి అంశం పై చర్చించే అవగాహన ఉండాలన్నారు. సమాజంలో అమ్మయిలు స్నేహితులకు గాని, తమ తోటి వారు సమస్యలలో ఉన్నప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేందుకు తోడ్పాటు అందించాలని సూచించారు. తల్లి తండ్రులు, టీచర్లు స్నేహభావంతో ఉన్నపుడు సమాజంలో అమ్మయిలు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో ధైర్యంగా చెప్పగలుగుతారని తెలిపారు. అధికారులు, ఎన్జీఓలు గ్రౌండ్ స్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని, అమ్మయిలను గర్భస్థ శిశువు నుండి కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. అనంతరం బాలికలు సమాజానికి మణిహారం, బాలికలకు రక్షణ కల్పిద్దాం వారి బంగారు భవితకు పునాది వేదం స్వేచ్ఛా యుతమైన వాతావరణం మరియు పోషకాహారం అందించి వారి అభివృద్ధికి తోడ్పడుదాం బాలికలను బ్రతకనిద్దాం, చదవనిద్దం 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేద్దాం మన వంతు సహాయం అందించి బంగారు తెలంగాణకు బాటలు వేద్దామని కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. బేటీ బచావో- బేటీ పఢావో పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్,జిల్లా విద్య శాఖ అధికారి రాధా కిషన్, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు , ఆచీూ. బ్రహ్మజీ , మెప్మ ఖఆ ఇంది రా. సూపర వైజర్స్, చైల్డ్ లైన్ కోర్డినేటర్లు, వివిధ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, పాల్గొన్నారు.

# లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరించండి



హైదరాబాద్, ఫిబ్రవరి 22:లష్కర్ జిల్లా సాధన కోసం తాము చేపట్టే పోరాటానికి మద్దతును ఇవ్వాలని లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాలతో నూతనంగా లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఏర్పాటైన జిల్లా సాధన సభ్యులు గురువారం ఆదర్శ నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేసి మద్దతు కోరారు.

ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ జిల్లా పరిధి విస్తరించిన కారణంగా పరిపాలన సౌలభ్యం కోసం లష్కర్ జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ పోరాటంలో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి గెలుపొంది కేంద్రమంత్రిగా వ్యవహరిస్తున్న కిషన్ రెడ్డి, హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రుల తో పాటు ఈ ఏడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలను కూడా కలిసి వినతిపత్రాలను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి సాధం బాలరాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు శైలేందర్, బాబురావు తదితరులు ఉన్నారు.

# నెల రోజుల పాటు వేచి చూస్తాం.. ఆ తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం : తలసాని



హైదరాబాద్, ఫిబ్రవరి 22:అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి, సనత్‌నగర్(రాజీనిజీబిప్రనిజీణజీతీ) ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అభివృద్ధి పనులు చేపట్టాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు.

గడిచిన 10 సంవత్సరాల్లో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో ఎన్నడూ జరగనన్ని అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్(అనీనిణతీవబబ) ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి పనుల్లో స్తబ్దత నెలకొందని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. నెల రోజుల పాటు వేచి చూస్తాం. ఆ తర్వాత తగిన కార్యాచరణతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి పనులు చేయిస్తామన్నారు.

# కెనడాలో నివసిస్తున్న 23 లక్షల మంది భారతీయులు రెండు దేశాల మధ్య సంబంధాలు పటిష్టం చేయడానికి, రెండు దేశాల అభివృద్ధికి సహకారం - డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:సస్కట్చెవాన్ ప్రావిన్స్ ప్రధానమంత్రి స్కాట్ మో అధ్యక్షతన కెనడా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈ రోజు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (స్వతంత్ర బాధ్యత), ప్రధానమంత్రి కార్యాలయంలో సహాయ మంత్రి, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్, అణుశక్తి, అంతరిక్ష సహక మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌ను కలిసింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తి, సైబర్ ఫిజికల్ సిస్టం, క్వాంటమ్ టెక్నాలజీ,ఫ్యూచర్ మ్యానుఫ్యాక్చరింగ్, గ్రీన్ హైడ్రోజన్ ఇంధనం, డీప్ ఓషన్ మైనింగ్ వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి పనిచేయడానికి గల అవకాశాలను రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి.

కెనడా ప్రతినిధి వర్గానికి స్వాగతం పలికిన డాక్టర్ జితేంద్ర సింగ్ ' కెనడా లో నివసిస్తున్న 23 లక్షల మంది మంది భారతీయులు రెండు దేశాల మధ్య సంబంధాలు పటిష్టం చేయడానికి, రెండు దేశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారు' అని అన్నారు. కెనడాలో అత్యధిక సంఖ్యలో 23 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారని మంత్రి తెలిపారు. కెనడా పార్లమెంట్, కెనడా మంత్రివర్గంలో భారతీయులకు స్థానం లభించడం రెండు దేశాల మధ్య ఉన్న సుస్థిర సంబంధాలకు నిదర్శనమని డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు. రెండు దేశాల అభివృద్ధికి సహకరిస్తున్న కెనడా లో నివసిస్తున్న భారతీయులు రెండు దేశాల మధ్య వారధిగా ఉన్నారని మంత్రి అన్నారు. కెనడా లో ఉన్నత విద్య అభ్యసించడానికి భారతీయ విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు అని మంత్రి అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏర్పాటైన అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ కార్యక్రమాలను కెనడా ప్రతినిధి బృందానికి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా కృషి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు రంగం పాత్ర 60-70% వరకు ఉందన్నారు.సాంకేతిక రంగం అభివృద్ధిలో ప్రభుత్వేతర సంస్థలకు భాగస్వామ్యం కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

సుస్థిర ఇంధన సాంకేతిక రంగం (ఉత్పత్తి, నిల్వ, పరివర్తన), పర్యావరణహిత పరిశుద్ధ ఇంధన వనరుల రంగం, బయో ఎకానమీ, ఆహారం,వ్యవసాయ సాంకేతిక రంగం, ఆరోగ్య సంరక్షణ (ఫార్మా, బయో మెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్) వంటి రంగాల్లో కెనడాకు చెందిన ఆర్ అండ్ డీ సంస్థలతో కలిసి పనిచేయడానికి భారతదేశం సిద్ధంగా ఉందని డాక్టర్ సింగ్ చెప్పారు.

'జీ-20 అధ్యక్ష హోదాలో భారతదేశం గత ఏడాది ప్రతిపాదించిన 'గ్లోబల్ బయో ఫ్యూయెల్ అలయన్స్' (జీబిఎ) వల్ల ఇంధన రంగంలో జీవ ఇంధనాల వినియోగం పెరిగి ఉద్యోగ అవకాశాలు పెరిగి ఆర్థిక వృద్ధికి సాధ్యమవుతుందని డాక్టర్ సింగ్ వివరించారు.

కర్బన ఉద్గారాలు తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం ఎక్కువ అయ్యేలా చూసేందుకు దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నేషనల్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారని కెనడా ప్రతినిధి బృందానికి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. దీనివల్ల భారతదేశం కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, ఇంధన దిగుమతు తగ్గుతాయని మంత్రి పేర్కొన్నారు.

'వైభవ్ ఫెలోషిప్ 'కార్యక్రమం కింద సాధించిన విజయాలను కెనడా బృందానికి డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. 'వైభవ్ ఫెలోషిప్ 'కార్యక్రమం కింద భారతదేశం లో ప్రధాన సంస్థల్లో పరిశోధనలు చేపట్టి దేశాభివృద్ధికి దోహదపడాలని ప్రవాస భారతీయులకు ప్రధాని మోదీ ఆహ్వానం పలికారని ఆయన తెలిపారు.

ఇటీవలి కాలంలో కెనడా, భారతదేశం మధ్య సంబంధాలు బలపడ్డాయని స్కాట్ మో అన్నారు.రెండు దేశాలకు ప్రయోజనం కలిగే విధంగా వివిధ రంగాలలో కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో శాస్త్ర, సాంకేతిక సహకారం కీలకంగా ఉంటుందని ఆయన తెలిపారు.రెండు దేశాల విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన బంధం ఉందన్నారు.

భారతదేశం, సస్కాట్చెవాన్ మధ్య సంబంధాలు బలపడ్డాయని స్కాట్ మో తెలిపారు. ముఖ్యంగా ఢిల్లీలో తమ కార్యాలయాన్ని తెరిచిన తరువాత, భారతదేశం తో కలిసి పనిచేయడానికి, సమిష్టి వృద్ధిని సాధించడానికి అవకాశాలు మరింత పెరిగాయన్నారు.

ఈ సమావేశంలో శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ అభయ్ కరందీకర్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలలో భారతదేశ పురోగతిని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందానికి వివరించారు.

# గోండు గిరిజనుల గోస పట్టదా- విజయ్ సంకల్ప యాత్రలో ఈటల



ఆదిలాబాద్, ఫిబ్రవరి 22:అధికారంలోకి రాగానే అడవి బిడ్డలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలందిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఊసెత్తకపోవడం శోచనీయమని మాజీ మంత్రి బిజెపి జాతీయ కార్యదర్శి సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప బస్సు యాత్ర గురువారం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ బస్సు యాత్రలో బిజెపి నేత ఈటెల రాజేందర్, ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

తొలుత గుడిహత్నూర్ లో బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఇంద్రవెల్లి లో జరిగిన రోడ్ షోలో ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. పట్టాల విషయంలో అడవి బిడ్డల గోసపుచ్చుకోవద్దని హితవు పలికారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కొండ నాలుకకు మందు పెడతామని చెప్పి ఉన్న నాలుక ఊడబీకారని, పోడుపటాలిస్తామని నమ్మించి 13 కాలంలు తొలగించి ఆదివాసుల హక్కులు కాలరాశారని ధ్వజమెత్తారు. పోడు పట్టాల పేరిట గత పాలకులు కమిటీల మీద కమిటీలు వేసి కాలయాపన చేశారని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మోదీ నాయకత్వంలో భారత దేశం నెంబర్ వన్

నరేంద్ర మోదీ నాయకత్వ కాలంలో భారతదేశం నెంబర్ 1 గా నిలుస్తుందని బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షులు మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని ఐబి చౌరస్తాలో నిర్వహించిన బిజెపి విజయసంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయడానికి ప్రజలు నాయకులు ఆశీర్వదించాలని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ రెండుసార్లు చేసిన పాలనలో ఇతర దేశాలకు ఆదర్శంగా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీకి ఆశీర్వదించి బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఇచ్చిన హామీలను విస్మరించారని ఆ హామీలను ప్రజలు కూడా మర్చిపోతున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ అంటే ఆయన కంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఇచ్చిన హామీల నిలబెట్టుకోవడంలో విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్రంలో రాష్ట్రంలో సుపరిపాలన కావాలంటే నరేంద్ర మోడీ నాయకత్వానికి మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. ఏజెన్సీ మండలాల్లో గిరిజనేతరులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు రైతుబంధు రావాలంటే బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

ఏజెన్సీ మండలాల్లో గిరిజ నేతలు సాగు చేసుకుంటున్న భూములకు పరిహారం చెల్లింపుట్లో ఈ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని ఆయన విమర్శించారు. కేంద్రంలో మూడోసారి బిజెపి అధికారంలోకి వస్తే నరేంద్ర మోడీ నాయకత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి తో పాటు ఆయన పాలన సబ్కా కా సత్ సబ్కా కా వికాస్ నరేంద్ర మోడీ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ సంకల్ప యాత్రలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపూరావు ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ పార్లమెంటు సభ్యులు రాథోడ్ రమేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయిల శంకర్, రాష్ట్ర జిల్లా నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన నీటి నిర్వహణకు గుర్తింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:ఎన్ టీ పీ సీ యొక్క పర్యావరణ, సామాజిక మరియు పాలనా నిర్వహణ ( ఈ ఎస్ జీ ) స్కోర్ రెండు స్థాయిలు పెరిగింది. కార్బన్ డిస్‌క్లోజర్ ప్రాజెక్ట్ (సీ డీ పీ) నీటి పరిరక్షణ రేటింగ్‌లో 2022లో 'డీ' రేటింగ్ నుండి 2023లో ' సీ' రేటింగ్‌కి మారుతుంది. ఈ ఘనత నీటి నిర్వహణపై నిర్దిష్ట ప్రాధాన్యతతో పర్యావరణ నిర్వహణ మరియు సుస్థిరమైన పద్ధతుల పట్ల ఎన్ టీ పీ సీ యొక్క అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం.

నీటి పునర్వినియోగం మరియు రీసైక్లింగ్‌ను మెరుగుపరచడానికి ఎన్ టీ పీ సీ యొక్క ప్రయత్నాలు సానుకూల ఫలితాలను అందించాయి. ఇటీవలి సంవత్సరాలలో నిర్దిష్ట నీటి వినియోగంలో గణనీయమైన తగ్గుదలలో ఇది ప్రతిబింబిస్తుంది. ఎదురయ్యే సవాళ్లు ఉన్నప్పటికీ ఎపునరుత్పాదక శక్తి ఏకీకరణ మరియు వెట్ ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ సిస్టమ్‌ల అమలు ద్వారా ఎన్ టీ పీ సీ వినూత్న చర్యలు మరియు సమర్థవంతమైన పద్ధతుల ద్వారా నీటి వినియోగాన్ని బాగా తగ్గిస్తోంది.

కార్బన్ డిస్‌క్లోజర్ ప్రాజెక్ట్ (సీ డీ పీ ) అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఈ ఎస్ జీ రేటింగ్ ఏజన్సీలలో ఒకటి. ముఖ్యంగా వాతావరణ మార్పు, నీటి భద్రత మరియు అటవీ నిర్మూలన వంటి వాటి పర్యావరణ పనితీరుపై కంపెనీలను అంచనా వేస్తుంది.

దాని నిబద్ధతను బలపరిచేందుకు సీ ఈ ఓ వాటర్ మాండేట్‌పై ఎన్ టీ పీ సీ 2021లో సంతకం చేసింది. బాధ్యతాయుతమైన నీటి నిర్వహణకు అంకితభావం మరియు నీటి సుస్థిరత్వ సవాళ్లను పరిష్కరించే లక్ష్యంతో ప్రపంచవ్యాప్త చొరవలో పాల్గొనడాన్ని ఇది నొక్కి చెబుతుంది.

అధునాతన సాంకేతికతలు మరియు ప్రాసెస్ రీఇంజనీరింగ్ ద్వారా నీటి వినియోగాన్ని సర్వోత్తమీకరణం చేయడం, పటిష్టమైన "నీటి విధానం" మరియు "వర్షపు నీటి వినియోగ విధానం " అమలు చేయడం మరియు అన్ని స్టేషన్‌లలో "శూన్య ద్రవ విసర్జన (జెడ్ ఎల్ డీ)'' స్థితిని కొనసాగించడం వంటివి నీటి సంరక్షణ కోసం ఎన్ టీ పీ సీ యొక్క ముఖ్యమైన నీటి చొరవలు.

ఇంకా, కంపెనీ ఎయిర్-కూల్డ్ కండెన్సర్‌ల ద్వారా 75% నీటిని ఆదా చేస్తుంది. మంచినీటి వినియోగాన్ని తగ్గించడానికి అన్ని స్టేషన్లలో మంచినీటి లభ్యత మరియు సామర్థ్య పెంపుదల మరియు సైకిల్స్ ఆఫ్ కాన్సంట్రేషన్ ( సీ ఓ సీ) లో కూడా ఇది కమ్యూనిటీ పెట్టుబడులను చేస్తుంది.

ఎన్ టీ పీ సీ లిమిటెడ్ భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తున్న అతిపెద్ద ప్రభుత్వ రంగ సమగ్ర విద్యుత్ రంగ సంస్థ. 74 జీ డబ్ల్యూ స్థాపిత సామర్థ్యం తో భారతదేశంలో ఉత్పత్తి చేయబడిన మొత్తం విద్యుత్‌లో 25% వాటాను అందిస్తుంది. ఎన్ టీ పీ సీ తన అశిలాజ ఆధారిత సామర్థ్యాన్ని 2032 నాటికి 45%-50%కి విస్తరించాలని చూస్తోంది. ఇది తన మొత్తం 130 జీ డబ్ల్యూ సామర్థ్యం లో 60 జీ డబ్ల్యూ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఎన్ టీ పీ సీ భారతదేశ నికర శూన్య విడుదల ప్రయత్నాలను బలోపేతం చేయడానికి నీతి ఆయోగ్‌తో భాగస్వామ్యం కలిగి ఉంది.

# కాంగ్రెస్ చలో సెక్రటేరియట్ ..షర్మిలతో సహా పలువురు నేతల అరెస్ట్..



## నిరుద్యోగమే లక్ష్యం

**-ప్రభుత్వంపై ఉద్యమాస్త్రం**
**-పోలీసు బలగంతో సర్కారు సిద్ధం**
**--ఎక్కడికక్కడ నేతల గృహనిర్బంధం**
**పార్టీ కార్యాలయంలోనే షర్మిల మకాం**
**-షర్మిల, గిడుగురాజు, మస్తాన్ వలి అరెస్టు**
**-ఏపీలో టెన్షన్ టెన్షన్**

అమరావతి, ఫిబ్రవరి 22:ఏపీలో నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్పార్టీ ఛలో సెక్రటేరియట్ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. బుధవారం రాత్రి నుంచే కాంగ్రెస్నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు.. పీసీసీ చీఫ్ షర్మిల బుధవారం రాత్రే ఆంధ్రరత్న భవన్‌కు చేరుకోవడంతో.. భారీ సంఖ్యలో పోలీసులు భవన్ని చుట్టుముట్టారు. బారికేడ్లతో ఆంధ్రరత్నభవన్ నుంచి బయటకు వచ్చే రోడ్లను దిగ్బంధనం చేశారు. ఎక్కడి కక్కడ భారీగా పోలీసులు మోహరించారు. చలో సెక్రటేరియట్‌కు అనుమతి లేదని తేల్చి చెప్పారు. ఈ స్థితిని కాంగ్రెస్ పార్టీ ముందే పసిగట్టి వ్యూహం మార్చింది. బుధవారం సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్ట్ కు చేరుకున్న షర్మిల.. అకస్మాత్తుగా రూట్మార్చారు. ముందుగా నిర్ణయించుకున్నట్టు కేవీపీ ఇంటికి కాకుండా.. విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌కు చేరుకున్నారు. తొలుత అంపాపురంలోని కేవీపీ నివాసానికి వెళ్లాలని భావించిన షర్మిల.. పోలీసులు అనుసరిస్తున్నారని తెలుసుకుని రూట్ మార్చి.. పార్టీ నేతలతో ఆంధ్రరత్న భవన్‌కు వెళ్లారు. గురువారం ఉదయం అక్కడి నుంచే చలో సెక్రటేరియట్‌కు వెళ్లాలని నిర్ణయించారు. అయితే.. కాంగ్రెస్ ఇచ్చిన చలో సెక్రటేరియట్ పిలుపుతో రంగంలోకి దిగిన పోలీసులు.. కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్ లు ప్రారంభించారు.

### అనుమతిలేదు.. అందుకే అరెస్టులు..

చలో సెక్రటేరియట్‌కు అనుమతి లేదని తెల్లవారుజాము నుంచే రోడ్లపైకి వచ్చిన కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో ఏపీలో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కానీ.. తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని.. ఎట్టి పరిస్థితుల్లో చలో సెక్రటేరియట్ వెళ్లి తీరుతామని వైఎస్ షర్మిల భీష్మించారు. అదే సమయంలో పార్టీ కార్యాలయం నుంచి బయటకి వచ్చిన సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఇది నియంత పాలన
### -ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల

వైసీపీ నియంత పాలనలో మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారని నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల మండిపడ్డారు. తమ చుట్టూ వేలాది మంది పోలీసులు పహారా కాస్తున్నారని.. ఇనుప కంచెలు వేసి బంధీలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల పక్షాన నిలబడితే అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహించారు. "మమ్మల్ని ఆపాలని చూసే మీరు ముమ్మాటికీ నియంతలే. ఇందుకు మీ చర్యలే నిదర్శనం" అని ఘాటుగా విమర్శించారు. గిడుగు రుద్రరాజు, మస్తాన్ వలిని వెంటనే విడుదల చేయాలన్నారు. 23 వేల పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి 6 వేలకే నోటిఫికేషన్ ఇచ్చినందుకు వైసీపీ సర్కార్ నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

### నిరుద్యోగమే అతిపెద్ద సమస్య..

రాష్ట్రంలో నిరుద్యోగమే అతిపెద్ద సమస్యని. 2.3 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని జగన్ అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వస్తే నోటిఫికేషన్ల వరద పారిస్తామని మాట ఇచ్చారని, ఐదేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్ ఎందుకివ్వలేదు? ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని. ఉపాధి లేక 21 వేలమంది ఆత్మహత్య చేసుకున్నట్లు సర్వేలు చెబుతున్నాయని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేస్తుంటే మమ్మల్ని ఎందుకు నియంత్రిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు, జర్నలిస్టులకు మాట్లాడే హక్కు లేదా? ఇది భారతదేశమేనా లేదా అఫ్ఘనిస్థానా? కర్ఫ్యూ వాతావరణం సృష్టించి మా కార్యకర్తలను అడ్డుకున్నారు .

### మేం తాలిబన్లమా..

పోలీసులను మీ బంటుల్లా వాడుకుంటారా? మేం ఏమైనా తాలిబన్లామా అని షర్మిల ప్రశ్నించారు.. ప్రజాస్వామ్యం లేదా? నిజంగా చిత్తశుద్ధి ఉంటే మేం ఆందోళన చేస్తే మీకెందుకు భయం? మేం ప్రజలకు దగ్గరవుతామని మీకు భయమా? మెగా డీఎస్సీ కాకుండా.. దగా డీఎస్సీ ఇచ్చారు. గ్రామ సచివాలయ ఉద్యోగాలు వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారు సరే, ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామన్న ఉద్యోగాలెక్కడ? అని షర్మిల ప్రశ్నించారు.

### షర్మిల అరెస్టు మంగళగిరికి తరలింపు

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏపీ సచివాలయం ముట్టడికి బయలుదేరిన షర్మిలను పోలీసులుఅడ్డుకున్నారు. అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్ కు తరలించారు. కాంగ్రెస్పిలుపు మేరకు చలో సచివాలయం నిరసనకు అనుమతి లేదని పోలీసులు అడ్డుచెప్పటమే కాదు? ఏపీలో ఎక్కడిక్కడే కాంగ్రెస్ నేతలను గృహనిర్బంధం చేశారు? గిడుగురాజును, మస్తాన్ వలీలను పోలీసులు అరెస్టు చేయటంతో?ఆంధ్రరత్న భవన్ఎదుటషర్మిల ధర్నాకు దిగారు. ఇక కాంగ్రెస్ శ్రేణులు అధికసంఖ్యలో విజయవాడకు చేరుకోగా.. చలో సచివాలయానికి షర్మిల బయలుదేరారు. ఈ సందర్భంగా విజయవాడలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భారీ సంఖ్యలో పోలీసులు షర్మిలను అడ్డుకున్నారు. అయినా చలో సచివాలయానికి షర్మిల బయలుదేరగా?తాడేపల్లిలో పోలీసులతో కాంగ్రెస్శ్రేణులు వాగ్వాదానికి దిగారు. అక్కడ ఆమెను అరెస్టు చేసి.. మంగళగిరి పోలీసు స్టేషన్ కు తరలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైఎస్ఆర్ ఆత్మ క్షోభిస్తుందని, ఈ ఘటనపై అమ్మ కూడా బాధపడుతుందని, వైఎస్సార్ బిడ్డ పోరాటం నిరుద్యోగుల కోసమే పోరాటం చేసిందని, సచివాలయం లో వినతి పత్రం ఇవ్వడానికి కూడా స్వేచ్ఛ కూడా లేదని కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో కనీసం ఒక్కరూ లేరట, సీఎం రాడు..మంత్రులు లేరు..అధికారులు రారు, వీళ్లకు పాలన చేతకాదు అనడానికి ఇదే నిదర్శనం, వీళ్లకు ఏది చేతకాదు, బిడ్డలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం నోటిఫికేషన్ లు ఇవ్వడం చేతకాలేదు, ఒక అడబిడ్డ అని చూడకుండా ఈ విధంగా ప్రవర్తించడం అన్యాయం అని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొంటా : అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఎస్పీ-కాంగ్రెస్ పొత్తు ఖరారైన నేపధ్యంలో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రలో తాను పాల్గొంటానని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ గురువారం ప్రకటించారు. ఆగ్రాలో జరిగే ర్యాలీకి అఖిలేష్ యాదవ్ హాజరవుతారని భావిస్తున్నారు.

కాంగ్రెస్‌తో పొత్తు దిశగా తాము పలు దశల చర్చలు జరిపామని, పలు జాబితాలు పరిశీలించామని, ఇక సీట్ల సర్దుబాటు పూర్తవడంతో కాంగ్రెస్ యాత్రలో ఎస్పీ పాల్గొంటుందని అఖిలేష్ యాదవ్ వెల్లడించారు. ఇక రాహుల్ భారత్ జోడో న్యాయ్ యాత్ర రెండవ నెలలో ప్రవేశించింది. మోదీ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ విపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను సమన్వయపరుస్తూ రాహుల్ యాత్ర సాగుతోంది.

అయితే రాహుల్ యాత్ర సాగుతుండగానే పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఒంటరి పోరుకు సిద్ధమని ప్రకటించడం, బిహార్ సీఎం నితీష్ కుజీమార్ ఇండియా కూటమి నుంచి బయటపడి ఎన్డీయేకు చేరువవడం విపక్ష కూటమిలో కలకలం రేపింది. ఇక రాహుల్ జోడో న్యాయ్ యాత్ర బెంగాల్‌లో ప్రవేశించినా తనకు మర్యాదపూర్వకంగా తెలియచేయలేదని, తాను ఇండియా

# శ్రీశైల క్షేత్రంలో వైభవంగా ముగిసిన మహాకుంభాభిషేక మహోత్సవాలు



శ్రీశైలం ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : శ్రీశైల క్షేత్రంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిసాయి. ఈనెల 16న ప్రారంభమైన ఉత్సవాల చివరి రోజు బుధవారం కంచికామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతీ, శ్రీశైల జగద్గురు పీఠాధిపతులు చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య, పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతీ, కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొని పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలో శివాజీగోపుర పునర్మిర్మాణం, ఉపాలయాల పునరుద్ధరణ, శివలింగ, నందీశ్వరుల ప్రతి1ష్టాపన, మహాకుంభాభిషేకం నిర్వహించారు. కుంభాభిషేకం నిర్వహణ వల్ల చతుర్విధ పురుషార్థసిద్ధి, మానసిక ప్రశాంతత, అధ్యాత్మిక పరిపుష్టి, ఆయురృద్ధి, కీర్తి జయం కలుగుతాయని, శారీరక, మానసిక వ్యాధులు నశిస్తాయని, సకల ఆపదలు తొలుగుతాయని పీఠాధిపతులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఏపీ దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కలికాల్ వళవన్, కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి , సభ్యులు పాల్గొన్నారు.

# హెల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లోస్కూల్ పిల్లలకు మధ్యాహ్నం ఆహార పంపిణీ



రంగా రెడ్డి ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);హెల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యం లో ఉప్పర్ పల్లి లో పమెనక్యాప్ కరకానా సేబాద్ మాంటెలీ పిల్లలకు మధ్యాహ్నం ఆహార పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లోఫౌండర్ చైర్‌పర్సన్ జ్యోతి కాకుమాను అప్పర్ స్పాన్సర్ జ్యోతి కాకుమాను, కార్పొరేట్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పోలంకి ఉషా రాణి,కె, ప్రవీణ్ కుమార్, కొమ్ము ప్రవీణ్ కుమార్, జగదాబాద్, జగదాబాద్, జగదాబాద్ చ. శాంత కుమార్, బాణాల ప్రేమల, కదారి అన్నపూర్ణ, కవిత, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# టీడీపీ జనసేన పార్టీ 'సమన్వయ కమిటీ సమావేశం'లో 2 తీర్మానాలకు ఆమోదం

అమరావతి ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తున్న టీడీపీ జనసేన పార్టీ గురువారం నిర్వహించిన 'సమన్వయ కమిటీ సమావేశం'లో 2 తీర్మానాలకు ఆమోదం తెలిపాయి. పొత్తును స్వాగతించిన టీడీపీ - జనసేన కేడర్‌ను అభినందిస్తూ ఒక తీర్మానం.. మీడియాపై దాడులను తప్పుపడుతూ రెండవ తీర్మానాన్ని సమన్వయ కమిటీ ఆమోదించింది. ఈ సందర్భంగా టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కీలక వివరాలను వెల్లడించారు. రెండు పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉమ్మడి సభ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. తాడేపల్లిగూడెం సమీపంలోని పత్తిపాడు వద్ద ఉమ్మడి సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఉమ్మడి మేనిఫెస్టోపై తుది కసరత్తు జరుగుతోందని, త్వరలో విడుదల చేస్తామని చెప్పారు. ఏయే స్థానాల్లో ఏయే పార్టీలు పోటీ చేయాలనేది చంద్రబాబు-జనసేన అధినేతలే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో టీడీపీ - జనసేన మధ్య గ్యాప్ లేకుండా పని చేయాలని ఇరుపార్టీల కేడర్‌కు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. టీడీపీ - జనసేన మధ్య వైసీపీ తగువులు పెట్టే ప్రయత్నం చేస్తోందని, ప్రజల మధ్యన కూడా జగన్ తగవులు పెడతున్నారని ఆరోపించారు. జగన్ అంత వరస్ట్ సీఎంను ఇప్పటివరకు చూడలేదని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి సీఎం జగన్ సైకోలా వ్యవహరిస్తున్నారని, ఏపీలో స్వేచ్ఛ లేకుండా పోయిందని మండిపడ్డారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం సీఎం జగన్ తిరిగి అధికారంలోకి రాకూడదనే ఏకైక లక్ష్యంతో పొత్తు పెట్టుకున్నామని, తాడేపల్లి గూడెంలో జరిగే ఉమ్మడి సభకు 6 లక్షల మంది వస్తారనే అంచనాతో సభకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

**ఎన్డీఏలోకి ఆహ్వానంపై..**

టీడీపీని ఎన్డీఏలో ఆహ్వానించారని, ఈ మేరకు జరిగిన చర్చల విషయంలో త్వరలో క్లారిటీ వస్తుందని, ఇందులో దాపరికం ఏమీ లేదని అచ్చెన్నాయుడు తెలిపారు. పొత్తులు పెట్టుకునే సమయంలో కొన్ని త్యాగాలు తప్పవని అధినేతలిద్దరూ చెప్పారని అన్నారు. టికెట్లు కోల్పోయిన వాళ్లు బాధ పడొద్దని చంద్రబాబు, పవన్ చెబుతూనే ఉన్నారని అచ్చెన్నాయుడు అన్నారు. ఇక వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉంచకూడదని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే మంత్రి ధర్మానపై ఈసీకి ఫిర్యాదు చేశామని, వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని ఈసీ చెబుతోంటే.. ధర్మాన దానికి విరుద్ధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతిపక్ష ఓటు చీలనివ్వకూడదనే ఉద్దేశ్యంతో పొత్తులు: నాదెండ్ల**

ప్రతిపక్ష ఓటు చీలనివ్వకూడదనే ఉద్దేశ్యంతో పొత్తులు పెట్టుకున్నామని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సమన్వయం లోపం లేకుండా రెండు పార్టీలు ఎన్నికలు వెళ్లబోతున్నాయని అన్నారు. టీడీపీ - జనసేన పార్టీలు కలిసి పని చేయాల్సి ఉంటుందని, అవసరమైతే త్యాగాలు కూడా చేయక తప్పదని చంద్రబాబు - పవన్ సూచిస్తున్నారని ప్రస్తావించారు.

ఈ నెల 28వ తేదీన జరిగే సభ ఉమ్మడి సభలో రెండు పార్టీల నేతలు పాల్గొంటారని, 'బై బై వైసీపీ' అనేది ఓ నినాదంగా మారాలని కేడర్‌కు సూచించారు. రెండు నెలల్లో వైసీపీ విముక్త రాష్ట్రంగా మారుతుందని నాదెండ్ల మనోహర్ ఆశాభావం వ్యక్తం చేశారు. యువత, మహిళలు, రైతులకు సంబంధించిన ముఖ్యమైన అంశాలతో కూడిన మేనిఫెస్టో రూపొందిస్తామని, అభ్యర్థుల విషయంలో త్వరలోనే క్లారిటీ వస్తుందని తెలిపారు. రెండు పార్టీల మధ్య ఎలాంటి గ్యాప్ లేదని, జరగాల్సిన కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయని ఆయన క్లారిటీ ఇచ్చారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## - టీయూడబ్ల్యూజే(ఐజేయు) మీడియా డైరీ ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) మీడియా డైరీ-2024ని గురువారం తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ డైరీలో పొందుపరిచిన సమాచారం జర్నలిస్టులకే కాకుండా ప్రభుత్వ అధికారులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉందని అంటూ టీయూడబ్ల్యూజేను అభినందించారు. మీడియాతో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని అన్నారు. నా రాజకీయ ఎదుగుదలలో మీడియా పాత్ర గణనీయంగా ఉందన్నారు. ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లకుండా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత మీడియాపై ఉంటుందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే ఐజేయూ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దండి సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు దాసరి దేవేందర్, జిల్లా కార్యదర్శి ముత్యం, కోశాధికారి సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు తడక శ్రీనివాస్, వేములవాడ ప్రెస్ క్లబ్ ఫౌండర్ రేగుల దేవేందర్, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నూగురి మహేష్, , దాడుల నివారణ కమిటీ కన్వీనర్ కొక్కుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి తుపుకారి శ్రీనివాస్, సూర్యకిరణ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ కొత్త హరి,జిల్లా కమిటీ సభ్యులు గంగుల రవికుమార్, శ్రీరాముల శ్రీధర్, మంగళగిరి శ్రీనివాస్, వేములవాడ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ప్రశాంత్, జాయింట్ సెక్రటరీ దూలం సంపత్, కోశాధికారి మధిరాల నరేష్, కార్యవర్గ సభ్యులు మ్యాన శ్రీనివాస్, గుడిసె కిషన్, ఉల్లందుల మల్లేశం,మద్దిరాల నరేష్, హబీబ్ పాషా, చందుర్తి ,కోనరావుపేట, రుద్రంగి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, దేవారెడ్డి,అంజన్న, సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ పాల్గొన్నారు.




# అల్ఫోర్స్‌లో ఘనంగా సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు

## -ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల సాంప్రదాయ నృత్యాలు

కరీంనగర్, ఫిబ్రవరి 22: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్ట్ మైదానంలో సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సమ్మక్క సారక్క నీవే మా దైవం - నీవే మా రక్ష. వచ్చావమ్మ సమ్మక్క - వచ్చావమ్మ సారక్క తదితర నృత్యాలు ప్రత్యేక ఆకర్శనగా నిలిచాయి. కోయ దొర వేశంలో విచ్చేసిన విద్యార్థి విభజించిన సమ్మక్క సారక్క మహోత్సవం ప్రత్యేక ఆకర్శనగా నిలిచాయి. సుమారు 300 మంది విద్యార్థులు వివిధ సాంప్రదాయ దుస్తులలో విచ్చేసి ఘనంగా నిర్వహించారు. దీనికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి హాజరై, శాస్త్రోత్తంగా ప్రారంభించారు. ప్రారంభానికి ముందు వారు సమ్మక్క - సారక్క చిత్రపటానికి పూజ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఈ జాతర మహోత్సవానికి ప్రత్యేకత ఏర్పడినదని, ప్రపంచ దృష్టి ఆకర్శిచే విధంగా వేడుకలను చాలా గొప్పగా, పూజా విధానాలను పాటిస్తూ జాతరను భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ నిర్వహిస్తున్నారని చెప్పారు. సమ్మక్క-సారలమ్మలను వనదేవతలుగా పిలువడం జరుగుతుందని, ముఖ్యంగా గిరిజన దేవతలుగా పరిగణించడం జరుగుతున్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగ ప్రధాన ఘట్టమైన సమ్మక్క సారక్క రాకను చాలా వైభవోపేతంగా గిరిజన సాంప్రదాయ పూజల నడుమ ప్రభుత్వ లాంఛనాలతో వనంనుంచి గద్దెమీదికి తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. మూడు రోజుల పాటు చాలా గొప్పగా తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రలైన ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా ఇలా వివిధ రాష్ట్రాలనుండి శక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. అమ్మవార్లకు అత్యంత ప్రీతి పాత్రమైన బంగారంగా పిలువబడే బెల్లం నైవేద్యాన్ని సమర్పించి, ఆశీస్సులను పొందడం గొప్ప ఆనవాయితిగా వస్తున్నదని చెప్పారు. గోవిందరాజులు, పడిగిద్ద రాజు అవలంబించే విధానాల ఓను తెలియజేయడానికై కార్యాక్రమాన్ని చాలా గొప్పగా నిర్వహించడం జరిగినదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ గ్యారంటీల అమలు అగ్రాజ్ పాటలా మారాయి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22:కాంగ్రెస్ గ్యారంటీల అమలు అగ్రాజ్ పాటలా మారాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మాజీ కార్పోరేషన్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశంతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ తీరుతో పాటు ప్రభుత్వ పథకాల అమలుపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎన్ని రోజులు అధికారంలో ఉంటాడో రేవంత్‌రెడ్డికే తెలియదన్నారు. వ్యవసాయం సాగనివ్వాలని ప్రభుత్వాన్ని కోరామని.. అదే సమయంలో హామీల అమలుకు సమయం తీసుకోమని చెప్పామన్నారు. రైతుబంధు ఆపేసి వ్యవసాయాన్ని ఆగం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారం లక్కీడ్రాలో లాటరీలాంటిదన్నారు.

రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను తిట్టేందుకు సీఎం కాలేదని.. ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యాచరణ ప్రకటించాలన్నారు. కొడంగల్ సభలో రేవంత్ భాష, వ్యవహార శైలి ముఖ్యమంత్రి హోదాకు తగినట్లుగా లేదన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఎందుకో రేవంత్ తన తీరును సమీక్షించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి తీరును తీవ్రంగా ఖండిసున్నామన్నారు. మంచి విషయాలు చర్చకు పెట్టి.. పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. పాలమూరు కష్టాలకు కేసీఆర్ కారణమని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి కాంగ్రెస్ పుణ్యమేనన్నారు.

కరెంటు, నీళ్లు, రైతుబంధు, రైతుబీమా ఇచ్చి రైతులకు అండగా నిలిచింది కేసీఆరేనని గుర్తు చేశారు. రేవంత్ అధికారంలోకి రాగానే అన్నీ కట్క బంద్ చేసినట్లుగా ఆగిపోయాయన్నారు. కొడంగల్‌లో ఓడిపోయాక మల్కాజ్‌గిరిలో గెలిచి ఎంపీ అయ్యాక రేవంత్ ఎన్నిసార్లు తెలంగాణ నీళ్ల గురించి, నిధుల గురించి మాట్లాడారు అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్‌రెడ్డి పాత్ర గుండు సున్నా అని నిరంజన్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో రాజకీయ పునాదులను పటిష్టం చేసుకునేందుకు రేవంత్ కొడంగల్‌కు చేసిన పనులు మొత్తం పాలమూరుకు చేస్తున్నట్లుగా భ్రమలు కల్పిస్తున్నారన్నారు. కొడంగల్‌లో శంకుస్థాపన చేసిన కళాశాలలు అన్నింటికీ అనుమతులు తెచ్చింది కేసీఆరేనన్న నిరంజన్‌రెడ్డి.. ఇందులో రేవంత్ గొప్పదనమేముందని ప్రశ్నించారు.

174 టీఎంసీలు గ్రావిటీ ద్వారా పాలమూరుకు రావాల్సిన నీటిని పొగొట్టిన పాపం కాంగ్రెస్ పార్టీదేనన్నారు. దశాబ్దాల పాటు జూరాల, నెట్టెంపాడు, భీమా పథకాల నిర్మాణాలను కాంగ్రెస్ పార్టీ సాగదీసిందని ఆరోపించారు. 35 ఏండ్లు, 40ఏండ్ల పాటు పాలమూరు ప్రాజెక్టులను సాగదీసిన కాంగ్రెస్ రాయలసీమ ప్రాజెక్టులు పూర్తి చేసి పాలమూరు ప్రాజెక్టులు ఎండబెట్టారని మండిపడ్డారు. 3.94 లక్షల ఎకరాల కల్వకుర్తి ఎత్తిపోతల ఆయకట్టులో కేవలం 3.9 టీఎంసీల రిజర్వాయర్లను నిర్మించారన్నారు. 17రిజర్వాయర్లను టెండర్లకు ముందే కాంగ్రెస్ ఎత్తివేసిందన్నారు. కల్వకుర్తి పరిధిలోని ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిలలో ఉన్న ఐదు పంపులు ఎన్నడూ నడవవన్నారు. ఐదు నడిస్తే టన్నెళ్లు, కాలువలు సరిపోవన్నారు. మూడు పంపుల సామర్థ్యం ఉన్న కాలువలు, టన్నెళ్లు నిర్మించి ఐదు పంపులు బిగించారన్నారు. సగం సగం పనులు చేసి కాంగ్రెస్ గాలికి వదిలేసిందన్నారు. 2014, 2019లో కల్వకుర్తి ఎత్తిపోతల పంపులు అన్నీ నీట మునిగాయన్నారు. కాంగ్రెస్ మాదిరిగా మేము ఎన్నడూ రాజకీయం చేయలేదన్నారు. ఎలా చేస్తే బాగవుతాయని ఆలోచించి రైతులకు నీరందించామన్నారు.

కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రైతుల పొలాలకు సాగునీరు అందించడం జరిగిందని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై కేసుల మీద కేసులు వేసి వేధించారన్నారు. వాటన్నింటినీ తట్టుకుని నీళ్లిచ్చే దశకు తీసుకువచ్చామన్నారు.

# నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ బృంద సభ్యులు

హైదరాబాద్ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : నాగార్జునసాగర్ డ్యామ్‌ను కేఆర్ఎంబీ బృంద సభ్యులు గురువారం సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వర్షకాలానికి ముందు నాగార్జునసాగర్ డ్యామ్ మరమ్మతు పనులు చేపట్టింది. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం తెలుపుతూ కేఆర్ఎంబీకి లేఖ రాసింది. ఏపీ ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో కేఆర్ఎంబీ రంగంలోకి దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# హనుమకొండ జిల్లాలో విషాదం.. చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి

హనుమకొండ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్‌బి): హనుమకొండ జిల్లాలో విషాదం నెలకొంది. చెరువులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన ఐనవోలు మండలం గర్మిళ్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన అనిల్(28), గోపాల్(11) బావ మరుదులిద్దరు చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. గోపాల్, అనిల్ మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సన్ ఫ్లవర్ రైతులను ఆదుకోండి : హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 22: సన్ ఫ్లవర్ రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ట్విట్టర్ వేదికగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ ఏడాది సన్ ఫ్లవర్‌కు మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 6,760 ఉండగా రైతులు రూ. 5 వేల లోపే అమ్ముకుం టున్నారు.

రైతులు మద్దతు ధర లేక క్వింటాల్‌కు రూ. 2వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగులో చేసిని విషయాన్ని గుర్తు చేశారు. గతంలో మాదిరిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

# చిన్నారులకు దివ్య ఆయుర్వేద ఔషధం స్వర్ణ ప్రాశన....

## -పిల్లల వైద్య శిబిరానికి భారీ స్పందన

కరీంనగర్, ఫిబ్రవరి 22: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని శ్రీ సంహిత ఆయుర్వేద హాస్పిటల్ లో నిర్వహించిన చిన్నపిల్లల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది .అధిక సంఖ్యలో పిల్లలు హాజరై స్వర్ణ ప్రాశన ఔషధాన్ని సేవించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ .రావణవేణి ప్రభాకర్ , డా.శుశృత ప్రియదర్శిని మాట్లాడుతూ దాదాపు 12 సంవత్సరాలుగా స్వర్ణ ప్రాశన ఔషధాన్ని పరిచయం ఉన్నవారికి , ఆయుర్వేదం పై అవగాహన ఉన్న వారికి ప్రత్యేకంగా తయారు చేసి ఇస్తున్నామన్నానీ, చిన్నారుల పాలిట దివ్య ఆయుర్వేద ఔషధం స్వర్ణ ప్రాశన అని తెలిపారు. . ముఖ్యంగా ఈ ఔషధాన్ని సేవించిన పిల్లల్లో మంచి ఫలితాలు ఉన్నాయన్నారు. ఎంతోవంది పిల్లలు మానసికంగా ,శారీరకంగా దృఢంగా తయారయ్యారనీ, వాళ్ళల్లో రోగ నిరోధక శక్తి పెరుగిందన్నారు. ఇలాంటి దివ్య ఔషధం అందరికి చేరాలన్న సత్ సంకల్పంతో , స్వల్ప వ్యయంతో స్వర్ణ ప్రాశన శిబిరం నిర్వహించి, దాదాపు 120 మంది పిల్లల కు ఔషధాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రతి పుష్యమి నక్షత్రము రోజు వేసుకునే ఈ ఔషధాన్ని క్రమం తప్పకుండా 30 నెలలు వేసుకున్నట్లైతే అద్భుతమైన ఫలితాలను పొందవచ్చన్నారు .ఇకనుండి ప్రతి పుష్యమి నక్షత్రం రోజున ఈ శిబిరం ఉంటుందనీ, 16 సంవత్సరాల లోపు పిల్లలు దీన్ని ఉపయోగించుకోగలరని తెలియజేశారు . చిన్నారుల వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి డాక్టర్ ప్రభాకర్ ఈ సందర్భంగా ధన్యవాదములు తెలియజేశారు .




# సమ్మక్క..సారలమ్మ జాతర సందర్భంగా మున్సిపల్ కార్మికులకు కోళ్లను పంపిణీ చేసిన ఎంఐఎం కార్పొరేటర్ నుజ్హత్ పర్వీన్ అలీబాబా



కరీంనగర్, ఫిబ్రవరి 22: (నేటినిజం ప్రతినిధి) సమ్మక్క సారలమ్మ జాతర పురస్కరించుకొని నగరంలోని ఎంఐఎం పార్టీకి చెందిన ఖాన్ పుర 4వ డివిజన్ కార్పొరేటర్ నుజహత్ పర్వీన్ అలీబాబా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు కోళ్లను పంపిణి చేయడం జరిగింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే సమ్మక్క సారక్క జాతరలో 4వ డివిజన్ ప్రజలు క్షేమంగా సుఖ సంతోషాలతో ఉండాలని కార్మికులు మొక్కు చెల్లించేం దుకు ఈకోళ్ల పంపిణి చేయటం జరుగుతుందని కార్పొరేటర్ పేర్కొన్నా రు. పారిశుధ్య కార్మికులు డివిజన్ కు వెన్నెముకలాంటి వారని, వారిని ఆదరించడం బాధ్యత అని చెప్పారు. వారి కష్టసుఖాల్లో తోడు ఉండాలనే సంకల్పంతో జాతరకు తన వంతు సాయం అందించామన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ జవాన్.. కార్మికులు పాల్గొన్నారు.

# గొర్రెల యూనిట్ల పంపిణీ అక్రమాల కేసులో నలుగురు అధికారుల అరెస్టు

హైదరాబాద్ ఫిబ్రవరి 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గొర్రెల యూనిట్ల పంపిణీ అక్రమాల కేసులో నలుగురు అధికారులు అవినీతి నిరోధకశాఖ అధికారులు గురువారం అరెస్టు చేశారు. అరెస్టయిన అధికారుల్లో కామారెడ్డి వెటర్నరీ ఏరియా ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ ధర్మపురి రవి, మేడ్చల్ పశుసంవర్ధకశాఖ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయి, రంగారెడ్డి జిల్లా భూగర్భ జల అధికారి రఘుపతి రెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేశ్ ఉన్నారు. గొర్రెల యూనిట్ల పంపిణీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు రికార్డులను పరిశీలించడంతో పాటు బాధితుల నుంచి వివరాలు సేకరించి విచారణ జరిపారు. అయితే, బినామీ పేర్లతో అక్రమాలకు పాల్పడ్డట్లు తేల్చారు. 130 గొర్రెల యూనిట్లకు సంబంధించి రూ. 2.10 కోట్ల మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ సొత్తు బినామీ ఖాతాలకు నిందితులు మళ్లించినట్లు గుర్తించారు. నలుగురు అధికారులు ప్రధాన నిందితుడు మొయిద్‌తో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డట్లు ఏసీబీ తేలింది. అయితే, గొర్రెల కొనుగోలు బాధ్యతలను రవి, ఆదిత్య చూడగా.. డబ్బులు జమ చేయుడానికి ఇన్‌చార్జిలుగా రఘుపతిరెడ్డి, గణేశ్ ఉన్నారు. నలుగురు కలిసి మొయిద్ ఇచ్చిన ఖాతాల్లో అప్‌లోడ్ చేశారు. ప్రకాశం జిల్లా కొన్న గొర్రెలు మంచాలలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయితే, ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడంతో గతేడాది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తును పోలీసులు అవినీతి నిరోధకశాఖకు అప్పగించారు. దీనిపై విచారణ కొనసాగిస్తున్న అధికారులు గురువారం నలుగురిని అరెస్టు చేశారు.

# సుప్రీంకోర్టు ఆవరణలో ఆయుష్ హోలిస్టిక్ వెల్ నెస్ సెంటర్‌ను ప్రారంభించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:సుప్రీంకోర్టు ఆవరణలో 'ఆయుష్ హోలిస్టిక్ వెల్ నెస్ సెంటర్ 'ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్, ఆయుష్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ ముంజ్పారా మహేంద్ర భాయ్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయుష్ హోలిస్టిక్ వెల్ నెస్ సెంటర్ ను నెలకొల్పడం, నిర్వహించడం, నిపుణుల సేవలు , అందించడం పై సుప్రీంకోర్టు, ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

సుప్రీంకోర్టు ఆవరణలో ఆయుష్ హోలిస్టిక్ వెల్ నెస్ సెంటర్ ను పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ సౌకర్యం కోసం తాను కృషి చేస్తున్నానని ఆయన తెలిపారు. ఆయుర్వేదం, సమగ్ర జీవన విధానాన్ని తానూ అనుసరిస్తున్నానని ఆయన తెలిపారు.సుప్రీమ్ కోర్టులో 2000 మందికి పైగా సిబ్బంది ఉన్నారని,తెలిపిన జస్టిస్ డీవై చంద్రచూడ్ న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా సిబ్బందికి కూడా సమగ్ర జీవన విధానాన్ని అలవరచాలని సూచించారు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆయుర్వేద వైద్యులందరికీ జస్టిస్ డీవై చంద్రచూడ్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఆయుష్ శాఖ కార్యదర్శి శ్రీ వైద్య రాజేష్ కోతేచ, మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద డైరెక్టర్ ప్రొఫెసర్ తనూజ నేసరి పాల్గొన్నారు.

శారీరక, మానసిక, భావోద్వేగ అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, సిబ్బంది సమగ్ర ఆరోగ్య సంరక్షణకు సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు ఆయుష్ హోలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్ సేవలు అందిస్తుంది.. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద క్రియాశీల భాగస్వామ్యంతో ఏర్పాటైన కేంద్రంలో ఆధునిక సౌకర్యాలు కల్పించారు. సుప్రీంకోర్టు నుంచి అందిన ప్రతిపాదన మేరకు ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆల్-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఎఐఎం) సుప్రీం కోర్ట్‌లో ఆయుష్ వెల్‌నెస్ సెంటర్ ను ఏర్పాటు చేసింది. ఒంహాజెం, సఫాదర్‌జంగ్, ఎమ్, మొదలైన అనేక ప్రదేశాలలో ఆల్-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద తన కేంద్రాలను ఏర్పాటు చేసింది. అదే విధంగా న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తులు సుప్రీంకోర్టు, సిబ్బంది కోసం సమగ్ర, సమీకృత వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.